INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

సోమవారం 29.07.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక -164 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## పలు పథకాల పేర్లను మార్చిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ప్రభుత్వం పలు పథకాల పేర్లను మార్చింది. విద్యా వ్యవస్థలోని పలు పథకాలకు గత ప్రభుత్వం పెట్టిన పేర్లను తొలగించింది. ఇందుకు సంబంధించిన ప్రకటనను ఏపీ మంత్రి నారా లోకేష్ తన ట్విట్టర్ ద్వారా తెలిపారు. రాష్ట్రంలో విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా తీర్చిదిద్దాలని పలు పథకాలకు కొత్త పేర్లు పెడుతున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. జగనన్న అమ్మఒడి స్థానంలో తల్లికి వందనం.. జగనన్న విద్యా కానుక స్థానంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర.. జగనన్న గోరుముద్ద స్థానంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం.. 'మన బడి నాడు-నేడు' స్థానంలో 'మన బడి-మన భవిష్యత్తు' పేర్లను ఖరారు చేశారు. స్వేచ్ఛ పథకం స్థానంలో 'బాలికా రక్ష'.. జగనన్న ఆణిముత్యాలు స్థానంలో అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం పేర్లను ఖరారు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

## పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తొలి పతకం



**స్పోర్ట్స్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తొలి పతకం సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనూ బాకర్ కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలో మనూ 221.7 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలువగా.. సౌత్ కొరియాకు చెందిన ఓ (243.2), కిమ్ (241.3) మొదటి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. ఒలింపిక్స్‌లో షూటింగ్ కేటగిరిలో పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచింది.

## ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** ఎర్ర కాలువ ముంపు వల్ల తూర్పుగోదావరి జిల్లాలో నష్టపోయిన పంట పొలాలను మంత్రుల బృందం పరిశీలించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్లతో కూడిన మంత్రుల బృందం ఉండ్రాజవరం, నిడదవోలు మండల్లాల్లోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించింది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పంట నష్టం వివరాలను మంత్రులకు వివరించారు. తాళ్లపాలెం గ్రామంలో వరద ముంపు వల్ల ఇళ్లలోకి నీరు చేరడంతో నష్టపోయిన బాధితులకు మంత్రులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. భారీగా కురిసిన వర్షాలకు ఉభయగోదావరి జిల్లాల్లో పంటలు బాగా నష్టపోయాయని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఎర్ర కాలువ ప్రభావంతో 20 నియోజకవర్గాల్లో రైతులు పంట నష్టపోయారని చెప్పారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల కాలువ పూడిక తీయకపోవడం, స్లూయిస్ మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రైతులకు నష్టం ఏర్పడిందన్నారు. భారీ వర్షాలకు కాలువకు పడిన గండ్లు యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎర్ర కాలువ ముంపు నుంచి రైతులను కాపాడేందుకు ఎంత ఖర్చయినా ఫర్వాలేదని, శాశ్వత వరద నివారణ చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు.

## కేంద్ర మంత్రి కుమార స్వామికి తీవ్ర అనారోగ్యం



**బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, జేడీ(ఎస్) నేత హెచ్. డి. కుమారస్వామి ఆదివారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో సిబ్బంది వెంటనే ఆయనను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బెంగళూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి కుమారస్వామి మాట్లాడుతున్నారు. ఆ క్రమంలో ఆయన ముక్కు నుంచి ఒక్కసారిగా రక్తం స్రవించడం ప్రారంభమైంది. ఈ విషయాన్ని విలేకర్లు గమనించి.. వెంటనే కేంద్ర మంత్రికి తెలియజేశారు.

**ముడా కుంభకోణానికి వ్యతిరేకంగా ఆందోళన కోసం..**

దీంతో హెచ్‌డి కుమారస్వామి తన ముక్కు రంధ్రాలను గుడ్డతో అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ వెంటనే భద్రత సిబ్బంది అప్రమత్తమ్యారు. ఆ క్రమంలో ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ముక్కు నుంచి ధారాపాతంగా కారుతుండడంతో.. ఆయన చొక్క మొత్తం రక్తంతో తడిసిపోయింది. ముడా కుంభకాణంపై పోరాటానికి సంబంధించిన కార్యచరణపై ఆదివారం బీజేపీ, జేడీఎస్ నేతలు సమావేశమయ్యారు. అనంతరం విలేకర్ల

2 లో

# సిగ్గు సిగ్గు... జగన్
# రాజీనామా చేయండి



- ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక అవ్వడానికా ?
- లేక మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా?
- అసెంబ్లీకి పోనని చెప్పే మీరు, ప్రతిపక్ష హెూదాకే కాదు...
- ఎమ్మెల్యే హెూదాకు కూడా అర్హులు కారు
- ఓట్లు వేసిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** మాజీసీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీసీసీ అధ్యక్షుడు, ఆయన సొంత చెల్లెలు మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి పోని జగన్ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. "సిగ్గు సిగ్గు!! మాజీ ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారు! . ప్రతిపక్ష హెూదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతా అనడం జగన్ గారి అజ్ఞానానికి నిదర్శనం. ఇంతకుమించిన పిరికితనం, చేతకానితనం, అహంకారం... ఎక్కడ కనపడవు, వినపడవు. మోసం చేయడం మీకు కొత్తేమీ కాదు జగన్ మోహన్ రెడ్డి గారు. కానీ మిమ్మల్ని ఎన్నుకుని, అసెంబ్లీకి పంపిన ప్రజలను ఇలా వెర్రిగా, వింతగా మోసం చేయడం, ఓట్లు వేసిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది" అంటూ ఓ రేంజ్‌లో విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. అసెంబ్లీకి పోకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం దివాళాకోరుతనమని షర్మిల మండిపడ్డారు. '%MLARMemberofLegislative Assembly, not Member of Media Assembly%µ పంచులు వేశారు. ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక అవ్వడానికా లేక మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా? అని జగన్‌ను షర్మిల ప్రశ్నించారు. "ఐదేళ్ల పాలన అంతా అవినీతి, దోపిడి. రాష్ట్రాన్ని మీరు అప్పుల కుప్ప చేసి పెట్టారు. నిండు సభలో అధికార పక్షం శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే తాపిగా ప్యాలస్‌లో కూర్చుని మీడియా మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేను చేసింది" అంటూ విమర్శలు గుప్పించారు.

**ఆఫ్రికా అడవులకు పోతారో, అంటార్టికా మంచులోకే పోతారో ఎవడికి కావాలి**

గత మీ పాలనపై విమర్శలకు, అసెంబ్లీలో ఆన్ రికార్డు సమాధానం ఇచ్చుకునే బాధ్యత మీది కాదా అని షర్మిల నిలదీశారు. "ప్రజలకు అన్యాయం జరిగితే అధికార పక్షాన్ని ఫ్లోర్ ఆఫ్ ది హౌస్‌లో ప్రశ్నించే బాధ్యత మీది కాదా?. అసెంబ్లీకి పోనని చెప్పే మీరు, ప్రతిపక్ష హెూదాకే కాదు, ఎమ్మెల్యే హెూదాకు కూడా అర్హులు కారు. వెంటనే రాజీనామా చేయండి!!. బడికి పోను అనే పిల్లోడికి టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తారు. ఆఫీసుకు పోననే పనిదొంగను వెంటనే పనిలోంచి పీకేస్తారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి పోను అంటూ గౌరవ సభను అవమానించిన వాళ్లకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పోనప్పుడు మీరు ఆఫ్రికా అడవులకు పోతారో, అంటార్టికా మంచులోకే పోతారో ఎవడికి కావాలి అప్పుడు. అసెంబ్లీకి పోని జగన్ అండ్ కో తక్షణం మీ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలి అని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అని తీవ్రంగా విమర్శించారు.

## విద్యాశాఖలో పథకాలకు
## మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయం



- గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకున్నారు
- ఆ దుస్సంప్రదాయానికి మంగళంపాడి.. విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భావితరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. ఈ మేరకు పవన్ ఒక ప్రకటనను విడుదల చేశారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారని గుర్తు చేశారు. ఆ దుస్సంప్రదాయానికి మంగళంపాడి.. విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామమని కొనియాడారు.

**డాక్టర్ సర్వేపల్లి పేరుతో..** పాఠశాల విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ లాంటివి ఇస్తున్నారు. ఈ పథకాన్ని డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరుతో అమలు చేయడం సముచితమని పవన్ కల్యాణ్ అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి, ఆంధ్రా విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా, భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో

2 లో

## 'ఏ' అంటే అమరావతి.. 'పీ' అంటే పోలవరం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ. 15వేల కోట్లు ఇస్తుందని ఎవరూ ఊహించలేదని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఎంత ఖర్చయినా భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు, మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

" ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం. ఈ రెండు నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేంద్రం కూడా అందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తోంది. అమరావతికి రూ. 2500 కోట్లతో రైల్వే లైన్ మంజూరైంది. రూ. 12 వేల కోట్ల నుంచి రూ. 15 వేల కోట్ల విలువైన అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అమోదం తెలిపారు. దీనికి అవసరమైన భూ సేకరణకు కేంద్రం సహకరిస్తోంది.

వెనకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా కలిసి.. ఆయా జిల్లాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు ఇస్తోంది. రాష్ట్రానికి రెండు మేజర్ పారిశ్రామిక కారిడార్లు రానున్నాయి. వివిధ ప్రాజెక్టుల రూపంలో దాదాపు రూ. 80 వేల కోట్ల నిధులు రాష్ట్రానికి వస్తున్నాయి. కేంద్ర పథకాల ద్వారా మరిన్ని నిధులు వస్తాయి" అని పెమ్మసాని తెలిపారు.

## గోదావరిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి నదిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా, గంటిపెదపూడి వద్ద గోదావరి నదిలో జరిగిన బోటు ప్రమాదంలో పి.గన్నవరంనకు చెందిన విజయ్ అనే యువకుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న సీఎం..విజయ్ కుటుంబానికి రూ. 5 లక్షలు సాయంగా ప్రకటించారు. నదిలో వరద ఉధృతి తగ్గేంత వరకు లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరివాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు

## డిప్యూటీ సీఎం ఆదేశాలతో... రంగంలోకి తిరుపతి ఎస్పీ



2 లో

## బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు శుభారంభం



**స్పోర్ట్స్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పారిస్ ఒలింపిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో పీవీ సింధు గెలిచింది. మాల్దీవులకు చెందిన ఫాతిమా నబాన అబ్దుల్ రజాక్‌పై ఆమె విజయం సాధించింది. కేవలం 29 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌ను సింధు 21-9, 21-6 తేడాతో గెలిచింది. మరోవైపు రోయింగ్ మెన్స్ సింగిల్స్ పోటీల్లో బాల్‌రాజ్ పన్వార్ క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు.

## మీ సాహసమే మాకు స్ఫూర్తి

- లైన్‌మెన్ రామయ్య సాహసం ప్రశంసనీయం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



2 లో

# ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపచేసేలా...
# శ్రీశైలంలో శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లు

- ప్రధానార్చకులతో పాటు అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఈవో పెద్దిరాజు
- ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణమాసోత్సవాలు
- భక్తులకు వసతి, దర్శనం ఏర్పాట్లు, అన్నప్రసాదవితరణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- శ్రావణమాసంలో 2వ , 4వ శుక్రవారాలలో ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- లోకకల్యాణం కోసం శ్రావణమాసమంతా అఖండ శివనామ భజనలు

( ఈ. వినోద్ కుమార్ , శ్రీశైలం ప్రతినిధి, జర్నలిస్ట్ ఫైల్ )





శ్రీశైలం క్షేత్రంలో రానున్న శ్రావణమాసోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై శ్రీశైలం దేవస్థానం ఈఓ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు... దేవస్థానం పరిధిలోని ప్రధానార్చకులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పర్యవేక్షకులుతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు . ఈ సమావేశంలో ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రతిష్ఠను పెంపొందించేలా ఎటువంటి లోటుపాట్లు, నిర్వాహణ లోపాలు లేకుండా శ్రీశైలంలో శ్రావణమాసోత్సవాలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ శ్రావణమాసోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని దర్శిస్తారని , ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర మరియు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఈ మాసంలో క్షేత్రాన్ని దర్శించే అవకాశం ఉందన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతి, దర్శనం ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ కూడా భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. క్షేత్రానికి విచ్చేసే ప్రతీ భక్తుడిని కూడా అతిథిగా భావించాలన్నారు.

ఈ విషయమై స్వచ్ఛంద సేవలు నిర్వహిస్తున్న శివసేవకులలో కూడా తగిన అవగాహన కల్పించాలని ప్రజాసంబంధాల అధికారిని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మాసోత్సవాల ప్రారంభంలోగానే ఆయా ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకోవాలన్నారు.

**భక్తులకు వసతి కల్పనపై...**

క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు వసతి కల్పన పట్ల ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వసతి విభాగాన్ని ఆదేశించారు. శ్రావణమాసంలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తున్న కారణంగా అందుబాటులో ఉండే డార్మిటరీ వసతి పట్ల భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. డార్మిటరీ వసతికి సంబంధించి మరిన్ని సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

**పుణ్యస్నానాలుపై...**

శ్రావణమాసంలో అధికసంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు

2 లో

## గోదావరిలో పడవ బోల్తా, ఆరుగురు గల్లంతు!



**అంబేద్కర్ కోనసీమ జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిలో పడవ బోల్తాపడి ఆరుగురు గల్లంతైన ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గోదావరి అవతలి ఒడ్డున ఉన్న ప్రజలకు పంచాయతీ సిబ్బంది పడవలో మంచినీళ్ల బాటిళ్లను తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే పడవ గంటి పెదపూడి నది పాయ వద్దుకు రాగానే ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పడవలో ఉన్న ఆరుగురు వ్యక్తులు గోదావరిలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు వాళ్ల ఆర్తనాదాలు విని మరో పడవలో 3 కి.మీ మేర ఛేజింగ్ చేసి ఐదుగురుని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అందులో గిడ్డి ఈశ్వర్ (27), నేలపూడి సత్యనారాయణ (45) గిడ్డి సత్యనారాయణ (45), నేలపూడి యోహాను (20), మద్ద మురళి (23) ఉన్నారు. అయితే, పడవలో ఉన్న మరో వ్యక్తి చదలవాడ విజయ్ (25) లైఫ్ జాకెట్ చిరిగిపోవడం వల్ల అతడు గల్లంతైనట్లుగా స్థానికులు తెలిపారు. కాగా, ప్రస్తుతం విజయ్ కోసం సహాయక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు.

## చేబ్రోలులో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు




**గుంటూరు,చేబ్రోలు (జర్నలిస్ట్ ఫైల్ )** గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని చేబ్రోలు గ్రామం కొత్తపేట ముస్లిం ఏరియాలో లో శనివారం జనసేన పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా మెంబెర్, చేబ్రోలు మండల కార్యదర్శి, ముస్లిం మైనారిటీ నాయకులు షరీఫ్ జనసేన ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ జనసేన మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోవడం ద్వారా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. తక్షణ సహాయం కింద రూ. 50వేల నుండి రూ. 2.50 లక్షల వరకు తక్షణసహాయం కింద అందుతుంది. ఎవరైనా ప్రమాదం లో మరణిస్తే రూ. 5 లక్షల బీమా అందుతుంది అన్నారు. ఏ పార్టీ కూడా కార్యకర్తలకు ఇలాంటి అవకాశం ఇవ్వలేదని కొని పార్టీలకు అసలు సభ్యత్వం లేదన్నారు. కార్యకర్తలను తన కుటుంబ సభ్యులగా భావించి అధినేత పవన్ కళ్యాణ్ ఇన్సూరెన్స్ కల్పిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు జనసైనికులు పాల్గొన్నారు.

## విద్యాశాఖలో పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతిగా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం రేపటి పౌరులకు మార్గ నిర్దేశనం చేస్తుందన్నారు.

**మధ్యాహ్న భోజనానికి డొక్కా సీతమ్మ పేరు..**

మధ్యాహ్న భోజన పథకానికి సైతం గత ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇందుకు భిన్నంగా'అపర అన్నపూర్ణ' డొక్కా సీతమ్మ పేరును ఈ పథకానికి పెట్టడాన్ని ప్రతి ఒక్కరం స్వాగతించాలన్నారు. ఏ వేళలో అయినా కడుపు నిండా అన్నంపెట్టి ఆకలి తీర్చిన దానశీలి డొక్కా సీతమ్మ దయాగుణం, సేవాభావం విద్యార్థులకు తెలియచేయడం ద్వారా ఆ సద్గుణాలు అలవడుతాయని అభిప్రాయపడ్డారు.

**యువతలో స్ఫూర్తి నింపేలా కలాం పేరు..**

మన దేశపు మిస్సైల్ మ్యాన్ డా. అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం ద్వారా యువతలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన కలాం ఎన్నో ఆటుపోట్ల నడుమ విద్యాభ్యాసం సాగించి శాస్త్రవేత్తగా ఎన్నో విజయాలు అందుకొన్నారని తెలిపారు. తదనంతరం రాష్ట్రపతిగా ఆదర్శవంతంగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కలాం జీవన ప్రస్థానం నవతరంలో స్ఫూర్తిని కలిగిస్తుందని చెప్పారు. మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేయడం ద్వారా వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకొంటారని అన్నారు. ఆ మహనీయుల దివ్యాశ్శీసులు, సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.

**పాత పేరు.. కొత్త పేరు**

జగనన్న అమ్మ ఒడి – తల్లికి వందనం, జగనన్న విద్యా కానుక – సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర, జగనన్న గోరుముద్ద – డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, మన బడి నాడు నేడు – మన బడి మన భవిష్యత్తు, స్వేచ్ఛ – బాలికా రక్ష, జగనన్న ఆణిముత్యాలు – అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం

# ఎన్డీఏ ప్రభుత్వం పైనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆశలు

- గత ప్రభుత్వ హయంలో లక్షలాదిమంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం..
- 11వ పిఆర్సి సీఎస్ కమిటీలు సూచించిన మేరకు వేతన పెంపుకు నిరాకరణ - తీవ్రంగా నష్టపోయిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు...
- ప్రభుత్వ పథకాలు నిలిపివేసి ఆర్థికంగా నష్టపరిచిన గత ప్రభుత్వం



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పని చేసే లక్షలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ లు తెలియజేశారు.

ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్లో గల రెవెన్యూ భవన్లో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మరియు 26 జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బొప్పరాజు , పలిశెట్టి ముఖ్య అతిథులుగా మరియు ఇతర రాష్ట్ర నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ...ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రత కోసం గత ప్రభుత్వం "అప్కాస్" ఏర్పాటు చేసి కొంత ధైర్యాన్ని కలిపించినప్పటికి, వారికి సంబంధించిన జీతభత్యాలు పెంపుదల, జీతల్లో వ్యత్యాసాలు, ప్రభుత్వ పథకాలు నిలిపివేత, కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం లాంటి అనేక అంశాలు గత ప్రభుత్వ పెద్దలు దృష్టికి అనేక సందర్భాల్లో ఏపీ జేఏసీ అమరావతి పక్షాన తీసుకువెళ్ళినా పట్టించుకోకుండా, పూర్తిగా నిర్లక్ష్యం వహించారని తద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో సహా తీవ్రంగా నష్టపోయారు అని తెలిపారు. అందులో ప్రధానంగా....

**జీతాల పెంపు..**

11వ పిఆర్సి కమిటీ మరియు అధికారులతో కూడిన సీఎస్ కమిటీ ఇద్దరు ఆమోదించి 30% వేతనాలు పెంచాలని సూచించగా అందుకు నిరాకరించిన ప్రభుత్వం కేవలం 23% మాత్రమే వేతనం పెంచగా ఏడు శాతం తగ్గించినందువలన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 2022 జనవరి నుండి ఇప్పటివరకు వేల రూపాయల నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పి ఆర్ సి కమిటీ సూచించిన మేరకు వేతనం పెంచి ఉంటే ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కొంతమేర లబ్ధిపొంది ఉండేవారని తెలియజేశారు.

అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వీరి జీతాలు 10వ పీ.ఆర్.సి ద్వారా దాదాపు 50% పెంపుదల జరిగిందనే విషయాన్ని కూడా %+శీ వీ% సమావేశంలో స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదు.

**ప్రభుత్వ పథకాల అమలు...**

అసలే అరా కోరా జీతం వస్తున్నప్పటికీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ సి ఎఫ్ ఎం ఎస్ లో ప్రభుత్వ ఉద్యోగిగా చూపడంతో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందరూ గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ పథకాలు ఉద్యోగి కోల్పోవడమే కాకుండా, వారితోపాటు వారిపై ఆధారపడి ఉన్న వారి కుటుంబ సభ్యులు కూడా ప్రభుత్వ పథకాలు రద్దు చేసినందున ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని తెలియజేశారు. ఒక్కో ఉద్యోగి సంవత్సరానికి లక్షల రూపాయలు ఆర్థికంగా నష్టపోయారని తెలియజేశారు.

అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వారి కుటుంబ సభ్యులకే కాకుండా ఔట్ ఉద్యోగులందరికీ కూడా అన్ని ప్రభుత్వ పథకాలు వర్తించేవి అనే విషయాన్ని కూడా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో సమావేశంలో స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదు.

**ఒకే శాఖలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా జీతాలు...**

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కొరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ సెవెన్ లో అన్ని కేటగిరీలను చూపకపోవడం అదేవిధంగా జీవోలో అథర్స్ (%శీష్ట్ర-వతీం%) ఆప్షన్ లేకపోవడంతో ఆ జీవో వల్ల కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గత అయిదు సంవత్సరాలుగా తీవ్రంగా నష్టపోవడంతో పలుమార్లు ఆ జీవోను సవరించాలని గత ప్రభుత్వానికి విన్నవించిన ఫలితం లేకపోయిందన్నారు.

అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఆప్షన్ ఉన్నందున అందరికీ ఒకే రకమైన జీతాలు వచ్చాయి అని అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం దృష్టికి స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదు.

**కొన్ని ప్రధాన శాఖల్లో పని చేసే స్కిల్డ్, సెమి స్కిల్డ్, అన్ స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వ్యత్యాసాలు**

కొన్ని ప్రధానమైన శాఖల్లో పని చేస్తున్న స్కిల్డ్, సెమి స్కిల్డ్, అన్ స్కిల్డ్ తరగతుల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని అనేకసార్లు గత ప్రభుత్వ హయంలో వివరించినా ఎలాంటి న్యాయం జరుగక వాళు ్ర అనేక ఉద్యమాలు రాష్ట్రస్థాయిలో చేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వం ఉద్యోగులతో అమలు చేస్తామని ఒప్పందాలు చేసుకొని కూడా అమలు చేయలేదు.

లేబర్ డిపార్ట్మెంట్ వాళ్ళు స్పష్టంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వాళ్లకు ఎంతెంత జీతాలు ఉండలో చెప్పినప్పటికీ, శాఖాపరమైన అధికారులు అమలు చేయకపోవడం వల్ల స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా నష్ట పోయారు.

కనుక ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్య శాస్విత పరిష్కారానికి చొరవ చూపి జీవో నెంబర్ 30 నీ సవరించి, న్యాయబద్ధంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చి రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు.

**సీనియారిటీ ప్రాతిపదికన ఇంక్రిమెంట్లు..**

ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో తక్కువ జీతానికి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రాతిపదికన ప్రతి సంవత్సరం ఎంతోకొంత ఇంక్రిమెంట్ ఇస్తూ వేతన వ్యత్యాసాన్ని అమలు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**వైద్యం కోసం ఈ.యస్.ఐ కి ప్రతి నెల డబ్బులు చెల్లిస్తున్నా సరైన వైద్యం లేదు...**

ప్రతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తన జీతం నుండి తనకు, తన కుటుంబ సభ్యులు వైద్యం కోసం ప్రతి నెల ఈ.యస్.ఐ క్రింద డబ్బులు చెల్లిస్తున్నప్పటికి, సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఈ.యస్.ఐ ఆసుపత్రిలో సరైన వైద్య సదుపాయాలు లేకపోతే, వాళ్ళు ఇతర ఎంప్యానల్డ్ ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తే, ఆయా ఆసుపత్రుల యాజమాన్యం వైద్యం చేయడానికి నిరాకరిస్తే, లక్షల రూపాయలు వడ్డీకి అప్పులు తెచ్చుకుని తనకు, తన కుటుంబ సభ్యులు కు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కనుక ప్రభుత్వం తక్షణమే ఈ.యస్.ఐ మరియు ఎంపానల్డ్ ఆసుపత్రుల యాజమాన్యం తో సమావేశాలు పెట్టీ సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇలాంటి అనేక దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కారం కాక, ఎక్కువ సమయం పని చేస్తూ, అతి తక్కువ వేతనాలు పొందుతున్న ఔట్ సోర్సింగ్ తీవ్రంగా నష్ట పోతున్నారు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, పట్టించుకోని కారణంగా రాష్ట్రంలోని లక్షలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, నూతన ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వంపై ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆశ పెట్టుకుని ఉన్నారని, ప్రభుత్వం వీరి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపచేసేలా...
## శ్రీశైలంలో శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆచరిస్తారని ... అందుచేత పాతాళగంగలో తగు ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్దేశించిన స్నాన ఘట్టాలలో మాత్రమే భక్తులు నదీస్నానాలు ఆచరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రస్తుతం వరదనీటి ప్రవాహం వలన నది లోతు పెరుగుతోందని చెబుతూ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా భక్తులలో అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయమై పాతాళగంగ స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన కంచెను దాటి వెళ్ళకుండా కంచెకు ఇటువైపునే భక్తులు స్నానాలాచరించే విధంగా చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని మరియు నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. ఇప్పటికే ఈ విషయమై పాతాళగంగలో సూచికబోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాతాళగంగలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల మరియు శౌచాలయాల నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

**దర్శనం, అన్నప్రసాద వితరణ ఏర్పాట్లపై...**

దర్శనం ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్నవిధంగానే ప్రతీరోజు కూడా వేకువజామున గం. 3.00లకే ఆలయద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాత:కాలపూజలను జరిపించాలని ప్రధానార్చకులకు మరియు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారిని ఆదేశించారు. ఉభయ దేవాలయాలలో మంగళహారతులు ప్రారంభం నుంచే అనగా వేకువజామున గం. 4.30ల నుంచే భక్తులకు దర్శనాలు అనుమతించాలన్నారు. సాయంత్రం గం. 4.00లకు వరకు కూడా దర్శనాలు కొనసాగించాలన్నారు. తిరిగి సాయంకాలం ఆలయశుద్ధి తదితర కార్యక్రమాల అనంతరం గం. 5.30ల నుంచి రాత్రి గం. 11.00ల వరకు కూడా దర్శనాలను కొనసాగిస్తుండాలన్నారు.

శ్రావణమాసోత్సవాలలో భక్తులరద్దీకనుగుణంగా అన్నప్రసాదవితరణ ఉండాలని అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఆదేశించారు. ఉదయం గం. 11.00ల నుంచే అన్నప్రసాద వితరణను ప్రారంభించాలన్నారు. అదేవిధంగా సాయంత్రం అల్పాహారాన్ని అందజేయాలన్నారు.

**క్యూలైన్లు, పారిశుద్ధ్య ఏర్పాట్లపై...**

క్యూలైన్లలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం మంచినీరు, అల్పాహారమును నిరంతరం అందజేస్తుండాలన్నారు. అవాంఛనీయసంఘటనలు జరగకుండా వుండేందుకు క్యూకాంప్లెక్సు, క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, దేవస్థానం వసతి భవనాలు మొదలైన అన్నిచోట్ల కూడా ఎలక్ట్రికల్ వైరింగు సరిగ్గా ఉండేవిధంగా తగు పర్యవేక్షణ చేస్తుండాలని ఎలక్ట్రికల్ విభాగాన్ని ఆదేశించారు. అవసరమైనచోట్ల ఎలక్ట్రికల్ వైరింగునకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. క్షేత్రపరిధిలో పారిశుద్ధ్యం నిర్వహణపట్ల తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రపరిధిలో అన్నిచోట్ల ముఖ్యంగా ప్రధానరహదారులు, పార్కింగు ప్రదేశాలు మొదలైనచోట్ల చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాటు చేయాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు.

**ధర్మప్రచారంపై...**

శ్రావణమాసమంతా కూడా అఖండ శివనామభజనలు ఆనవాయితీ అనుసరించి నిర్వహించాలని ఆలయవిభాగాన్ని ఆదేశించారు. ధర్మప్రచారంలో భాగంగా శ్రావణమాసంలోని రెండవ మరియు నాల్గవ శుక్రవారాలలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపించాలన్నారు. ఈ వరలక్ష్మీ వ్రతాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనేలా తగు ప్రచారాన్ని కల్పించాలని శ్రీశైలప్రభ విభాగాన్ని ఆదేశించారు.

నిత్యకళారాధనలో భాగంగా శ్రావణమాసంలో ప్రత్యేకంగా ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. భక్తి సాహిత్య కార్యక్రమములో భాగంగా ప్రముఖ కవి పండితులచేత అవధాన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదేవిధంగా శ్రావణమాసంలో ప్రఖ్యాత ప్రవాచకులచేత ఆధ్యాత్మిక ప్రవచనాలను ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల విభాగాన్ని ఆదేశించారు.

**ట్రాఫిక్ కష్టాలు వద్దు...**ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్రమబద్దీకరణకు చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమైన స్థానిక పోలీసుశాఖ సహకారాన్ని పొందాలని సూచించారు.

## మీ సాహసమే మాకు స్ఫూర్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** లైన్మెన్ కూర రామయ్య చేసిన సాహసం ఏపీ విద్యుత్ ఉద్యోగులందరికీ ఆదర్శనీయమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్ తీగలపై నడిచివెళ్లి కరెంట్ పునరుద్ధరించడాన్ని మంత్రి కొనియాడారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఇటీవల భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే.

ఆ వర్షాలకు పలు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంటలు నీట మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి మధ్య నిలిచిపోయిన విద్యుత్ను ప్రాణాలకు సైతం తెగించి రామయ్య పునరుద్ధరించిన సంగతి మంత్రి రవికుమార్ దృష్టికి వచ్చింది. దీంతో ఎక్స్(ట్విటర్) వేదికగా మంత్రి ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.."ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని లైన్ మన్ రామయ్య నిరూపించారు. ఆయన చేసిన సాహసం తోటి ఉద్యోగులు అందరికీ ప్రత్యక్ష ఉదాహరణ. వరద ఉద్ధృతిని సైతం లెక్క చేయకుండా తీగలపై నడిచి విద్యుత్ పునరుద్ధరించిన రామయ్యకు అభినందనలు. ఆయన సాహసం ఇతర ఉద్యోగులకు ఆదర్శనీయం. సంక్షోభం నుంచి ఎలా బయటపడాలనే విషయంలో అందరికీ ఆయన స్ఫూర్తిగా నిలిచారు. ప్రజావసరాలను తీర్చడంలో ఎన్డీయే ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని రామయ్య నిరూపించారు.

భారీ వర్షాలకు అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి విద్యుత్ నిలిచిపోయింది. అక్కడి ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు కోల్పోయారు. ఈ తరుణంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న లైన్ మెన్ రామయ్య వరద ఉద్ధృతిని లెక్క చేయలేదు. విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యంగా తీగలపై నడుచుకుంటూ వాగు దాటి కరెంట్ సేవలు పునరుద్ధరించారు. విధి నిర్వహణలో రామయ్య చూపిన సాహసం, తెగువ ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి. కష్టపడిన వారికి ఎప్పటికైనా గుర్తింపు వస్తుంది. ఈ ఘటన ఎంతో మంది ఉద్యోగుల్లో చైతన్యం నింపుతుందని ఆశిస్తున్నా" అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశంసించారు.

## కేంద్ర మంత్రి కుమార స్వామికి తీవ్ర అనారోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతుండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది.

**తనయుడితో పాటు పాల్గొన్న కుమారస్వామి..**

ఈ సమావేశంలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బిఎస్ యడ్యూరప్ప, హెచ్ డి కుమార స్వామి నిఖిల్ గౌడ సైతం హాజరయ్యారు అయితే ఈ ఏడాది మార్చిలో చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో ట్రాన్స్కాథెటర్ ఆరోటిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టీఏవీఐ) జరిగింది. అంతేకాదు గతంలో కుమారస్వామికి రెండు సార్లు గుండె పోటు వచ్చింది.

**మోదీ కేబినెట్లో చోటు..**

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాండ్య ఎంపీగా జేడీ(ఎస్) అభ్యర్థిగా హెచ్ డి కుమారస్వామి బరిలో నిలిచి గెలిచారు. దీంతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో జేడీ(ఎస్) పార్టీ ఒకటి. ఈ నేపథ్యంలో మోదీ కేబినెట్లో హెచ్ కుమారస్వామికి చోటు దక్కింది. కీలక మంత్రిత్వ ఉక్కు శాఖ మంత్రిగా హెచ్ డి కుమారస్వామి బాధ్యతలు చేపట్టారు.

## రైతాంగం నడ్డివిరిచే బడ్జెట్ ను వ్యతిరేకించండి

**తాడేపల్లి రూరల్ (జర్నలిస్టు ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని నడ్డి విరిచే విధంగా ఉందని, రైతాంగ వ్యతిరేక బడ్జెట్ను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై నిరసన కార్యక్రమం ఎంటిఎంసీ పరిధిలోని గుండె మెడ గ్రామంలో జరిగినది. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని నడ్డి విరిచే విధంగా రైతాంగానికి బడ్జెట్ 1,52,000 కోట్ల రూపాయలు తగ్గించడం దుర్మార్గమన్నారు. ఈ బడ్జెట్ వలన యావత్ రైతాంగానికి కాక, సామాన్య ప్రజలపై భారం పడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా రైతులకు పెట్టుబడి మొత్తం పెరగడం, ఆదాయం మాత్రం తక్కువగా ఉంటుందన్నారు. ఇప్పటికే రైతాంగానికి ఎరువు కట్టలు, పురుగుమందులు ఇంకా రైతాంగానికి అందించే సబ్సిడీ మొత్తం కూడా కోత విదించారని ఆయన దుయ్యబట్టారు. దీనిపరివేసానమే గ్రామీణ జీవితాల్లో ప్రభావం ఉంటుందనీ, వ్యవసాయ పనులు లేక కార్మికులు దారిద్రానికి దిగు రేకు వెళ్తారని ఆయన అన్నారు. అలాగే కౌలుదారులు నష్టాల పాలవుతారు కనుక కేంద్ర ప్రభుత్వానికి తెలియపరచాలని ఉద్దేశంతోనే ఈ బడ్జెట్ ప్రతులను దహనం చేయటం జరిగిందన్నారు. అలాగే తెలంగాణలో రైతు రుణమాఫీ ఆంధ్రప్రదేశ్లో కూడా ప్రవేశ పెట్టాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, కెవిపిఎస్



నాయకులు నాగ పోగు విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం ఆదేశాలతో... రంగంలోకి తిరుపతి ఎస్పీ

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్)** తిరుపతి జిల్లా వెంకటగిరిలో యువతులను, వృద్ధులను వేధిస్తున్న ఆకతాయిలని అదుపు చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలకు తిరుపతి పోలీసులు తక్షణం స్పందించారు.

వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీకి వెళ్ళి అక్కడి ప్రజలతో పోలీసులు మాట్లాడారు. ఆకతాయిల వివరాలు నమోదు చేసుకున్నారు. బైక్స్‌పై మితిమీరిన వేగంతో ప్రమాదకరంగా సంచరిస్తున్న ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోకిరీలకు తిరుపతి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. వేధిస్తున్నవారిని పట్టుకొని కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడించారు.

తాము తీసుకున్న చర్యలను డిప్యూటీ సీఎంకు తిరుపతి ఎస్పీ వివరించారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తరుచూ కంప్లైంట్లు వస్తున్నాయని సుబ్బారాయుడికి పవన్ చెప్పారు. రౌడీయిజం చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే అదుపులో పెట్టాలని పవన్ ఆదేశించారు.

కాగా, తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలియచేసిన సమస్య



డిప్యూటీ సీఎం పవన్‌ను కదిలించింది. ముఠాలుగా ఏర్పడిన కొందరు యువకులు బైక్స్‌పై ప్రమాదకరంగా, వేగంగా వీధుల్లో సంచరిస్తూ విద్యార్థినులను, యువతులను, మహిళలను వేధిస్తున్నారని%ఔ% వృద్ధులను భయపెడుతున్నారని లేఖ రాశారు. అదే విధంగా యువతుల ఫోటోలు తీసి ఇంటర్నెట్‌లో పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలు పెట్టడం, ఇళ్లపై రాళు ్ళ వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. సదరు యువకుల వివరాలు, బైక్స్‌పై వేగంగా సంచరిస్తున్న ఫోటోలను, వాహనాల నంబర్లను సైతం తమ ఫిర్యాదుకు జత చేశారు. ఆ యువకులను పట్టుకొని హెచ్చరిస్తే ప్రధాన రహదారికి వస్తే దాడి చేస్తామని బెదిరించారని తెలిపారు. ఆ యువకులు ఒక మహిళా ఎస్సైను సైతం వేధించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడితో పవన్ కల్యాణ్ మాట్లాడారు. వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి వచ్చిన సమస్యను తక్షణమే పరిష్కరించాలి అన్నారు. ఆడ పిల్లలను, మహిళలను వేధించేవారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారిస్తామని తగు చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎస్పీ తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

## తెలంగాణా వార్తలు

### ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచుతాం : మంత్రి తుమ్మల



**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఖమ్మం సర్వజన ఆసుపత్రిని ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అరగంటపాటు ప్రాంగణంలో తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రాంగణంలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పరిసరాలను శుభ్రపరచాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచుతామని.. వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ఆయా అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు. మంత్రి వెంట నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ ఉన్నారు.

### గోషామహల్‌లో కుంగిన రోడ్డు..బోల్తా పడిన డీసీఎం



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ గోషామహల్‌లో ఉన్నట్టుండి రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో ఓ డీసీఎం బోల్తా పడింది. మిగతా వాహనదారులు అప్రమత్తమై తమ వాహనాలను ఆపేశారు. ప్రమాదం జరిగే సమయంలో వాహనం పక్కన ఎవరు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డు కుంగిపోవడంతో అక్కడ భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు శ్రమిస్తున్నారు. కాగా, కొత్తగా వేసిన రోడ్డు కుంగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# ఉగ్రరూపమెత్తిన గోదారమ్మ

- వరద తాకిడికి నానుతున్న పంటలు
- నష్టాలపై ఆందోళనలో రైతాంగం
- భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి ఉధృతి
- మూడో ప్రమాద హెచ్చరిక విరమణ





**ఆలమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గోదారమ్మ తగ్గినట్టే తగ్గి తిరిగి వరద నీటితో ఉగ్రరూపం దాల్చింది. రోజురోజుకు పెరుగుతూ లంక భూములను ఆక్రమించడంతో పంటలు వరద నీటిలో నానుతున్నాయి. దీంతో రైతాంగం తమ పంట నష్టాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రైతులు తమ విలువైన పంటలన్నీ పాడైపోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ధవలేశ్వరం బ్యారేజి నుంచి విడుదలవుతున్న వరద నీరు ముందుగా కోనసీమ జిల్లాలో ఆలమూరు మండలంలోని లంక భూముల్లో నీరు చేరడంతో అనేక పూల తోటలు, వాణిజ్య పంటలు మునిగాయి. దీంతో పండిన పంటలను బయటకు తీసుకు రావడం కూడా సాధ్యం కాదని రైతులు వాపోతున్నారు. మండలంలోని మడికి, బడుగువానిలంక, చెముడులంక, చొప్పెల్ల మూలస్థాన అగ్రహారం, జొన్నాడ లంక భూములకు రాత్రికి భారీగా వరదనీరు చేరనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూములలో అ-రటి, బొప్పాయి, జామ, కంద, తమలపాకులు వంటి వాణిజ్య పంటలతో పాటు దొండ, బెండ, వంగ, మిరప, కాకర, పొట్ల, దోస వంటి కూరగాయ పంటలు, బంతి, గులాబీ, లిల్లీ, కనకాంబరం, మల్లి, జాజులు వంటి పూల తోటలు అలాగే వివిధ రకాల ఖరీదైన నర్సరీ మొక్కలు ఉండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కంటే ఈ ప్రాంతంలోనే ఖరీదైన పంటలు సాగు చేస్తుంటారు. అధిక పెట్టుబడులతో సాగయ్యే ఈ పంటలు ఏటా గోదారమ్మ ఉగ్రరూపానికి పాడైపోవడం వల్ల రైతులు ఆవేదనకు అంతులేకుండా పోతుంది. ఇక్కడతో ఆగక మరింత వరదనీరు ఎగువ ప్రాంతాలనుండి వస్తుందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో పల్లపు ప్రాంతాల భూమిలేగాక మెరక ప్రాంతంలో పంటలు ముంపు బారిన పడతాయని రైతులు భయాందోళనలు చెందుతున్నారు. వీటితోపాటు చొప్పెల్ల, మూలస్థానం లంకల్లో పలువురు ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. అవి పూర్తిగా నీట మునగడంతో నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.

**భద్రాచలం (జర్నలిస్టు ఫైల్) :** భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి తగ్గడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను విరమించారు. అయితే రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. శనివారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 53.8 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వరద పోటు తగ్గింది. ఆదివారం ఉదయం 9 గంటలకు 52.2 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు విరమించారు. 48 అడుగుల కంటే వరద నీటిమట్టం తగ్గితే రెండో ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరిస్తారు. అయితే భద్రాచలం గోదావరి స్నాన ఘట్టాల వద్ద నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉండటంతో, అక్కడికి ఎవరినీ రానీయకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వెళ్లే రోడ్లపై పలుచోట్ల వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే రహదారులపై వరద ఉండడంతో రవాణా ఆగిపోయింది. ముంపు ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు అధికారులకు సూచించారు.

## హెరాయిన్ సరఫరా చేస్తున్న తండ్రీకుమారుల అరెస్ట్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** డ్రగ్స్ రవాణా, విక్రయం, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. రాజస్థాన్ నుంచి హెరాయిన్ సరఫరా చేస్తున్న తండ్రీకుమారులని మహేశ్వరం ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితుల వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రత్లాం జోరా ప్రాంతానికి చెందిన హనీఫ్ షా అలియాస్ హనీఫ్(65) స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతడి కుమారుడు సిద్దిక్ షా(31) కాస్మొటిక్స్ వ్యాపారం చేస్తున్నాడు. వీరి ఇద్దరి సంపాదన కూడా కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అధిక సంపాదన కోసం డ్రగ్స్ విక్రయాలు ప్రారంభించారు. రాజస్థాన్ ప్రతాప్?ఘడ్‌కు చెందిన మోంటూతో పరిచయం పెంచుకున్నారు.

## ట్రావెల్స్ బస్సులో భారీగా బంగారం చోరీ



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** : హైదరాబాద్ నుంచి ముంబై వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో రూ. 3 కోట్ల విలువైన బంగారు ఆభరణాలున్న బ్యాగు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ముంబైకి బయలుదేరింది. అదే బస్సులో బంగారు నగల వ్యాపారి ఆశిష్ (32) నాలుగు కేజీల నగలతో ముంబైకి వెళ్తున్నాడు. బస్సు అర్ధరాత్రి సత్వార్ వద్ద కోహినూర్ దాబా వద్ద ఆగింది. ప్రయాణికులందరూ దిగారు. సిగరెట్ తాగేందుకు ఆశిష్ కిందికి దిగాడు. తిరిగి బస్సెక్కి చూస్తే ఆభరణాలున్న సంచి కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. దొంగలు ప్రయాణికుల్లా బస్సెక్కడం, ఆ తర్వాత బ్యాగుతో వెళ్లడం దాబా వద్దనున్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది.

### షా లాంటి వ్యక్తి హెూంమంత్రి కావడం విచిత్రమే: శరద్ పవార్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** అమిత్ షా వంటి వ్యక్తి హెూంమంత్రి కావడం విచిత్రమేనని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించారు. 'నేను దేశంలోని అవినీతిపరుల ముఠాకు నాయకుడినని షా అసత్యాలు పలికారు. ఓ కేసు విషయంలో సుప్రీం కోర్టు ఆయన్ను 2ఏళ్ల పాటు గుజరాత్ నుంచి బహిష్కరించింది. అలాంటి మనిషి నేడు మనకు హెూంమంత్రి. దేశం ఎలాంటివారి చేతిలో ఉందో అందరూ ఆలోచించుకోవాలి. ఇలాంటి వ్యక్తులు దేశాన్ని అవినీతిదారిలోనే నడిపిస్తారు' అని మండిపడ్డారు.

### కోచింగ్ సెంటర్‌లో పోటెత్తిన వరదనీరు

- ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్ విద్యార్థులు మృతి చెందిన విషాద ఘటన శనివారం సాయంత్రం సెంట్రల్ ఢిల్లీలో జరిగింది. నిన్న సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఓల్డ్ రాజిందర్ నగర్‌లో ఉన్న ఓ భవనంలోని అడుగుభాగంలో రావ్ ఐఏఎస్ స్టడీ కోచింగ్ సెంటర్ ఉంది. సుమారు నిన్న రాత్రి 7 గంటల సమయంలో ఆ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు పోటెత్తింది. ఈ ఘటనలో అక్కడున్న ముగ్గురు సివిల్ విద్యార్థులు నీటమునిగి చనిపోయారు. 7 గంటల సమయంలో రావ్ ఐఏఎస్ స్టడీ సెంటర్ నీటమునిగినట్లు తమకు ఫోను వచ్చిందని ఢిల్లీ అగ్నిమాపక విభాగం తెలిపింది. వెంటనే అయిదు అగ్నిమాపక యంత్రాలతో ఘటనాస్థలానికి వెళ్లామని, భవనం అడుగుభాగం పూర్తిగా జలమయమైపోయిందని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ చేపట్టిన సహాయకచర్యలతో ముగ్గురు విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

### రీల్స్ చేస్తూ కాలు, చేయి పోగొట్టుకున్న యువకుడు



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** నేటి యువతకు సోషల్ మీడియా పిచ్చి ముదిరిపోతోంది. ఫాలోవర్లు.. లైక్స్ కోసం ప్రాణాలకు తెగించి ఫీట్లు చేస్తున్నారు. ఆ ఫీట్లు చేసే క్రమంలో ప్రాణాలు కోల్పోతు కన్నవాళ్లకు కడుపుకోత మిగుల్చుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాంతక విన్యాసాలతో తీవ్రంగా గాయపడి జీవచ్ఛవంలా మిగిలిపోతున్నారు. ప్రమాదకరమని తెలిసినా.. లైకులు, వ్యూస్ కోసం బరితెగించి స్టంట్లు చేస్తున్నారు. ఇలాంటి భయంకర స్టంట్లపై తాజాగా సెంట్రల్ రైల్వే సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. యువత ప్రమాదకరమైన స్టంట్లు చేయడం మానుకోవాలని అవగాహన కల్పిస్తూ ఓ యువకుడి విషాదగాథ సెంట్రలై రైల్వే పోస్టు చేసింది. వీడియోలో మస్జిత్ షా అనే యువకుడు కదులుతున్న రైలు హ్యాండిల్‌ను రెండు చేతులతో పట్టుకొని పరుగులు తీశాడు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. అతణ్ని అదుపులోకి తీసుకోవాలని అతడి ఇంటికి వెళ్లిన పోలీసులు మస్తిత్ పరిస్థితి చూసి షాక్ అ-య్యారు. ఒక కాలు, చేయి కోల్పోయిన స్థితిలో ఆ యువకుడు కనిపించాడని.. ఏప్రిల్ 14న రైల్వేస్టేషనులో రీల్స్ చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని తెలిపారు. మస్జిత్ షా ఘటన ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సెంట్రల్ రైల్వే చీఫ్ పీఆర్వో స్వప్నిల్ వెల్లడించారు.

## ఒడిశాలో కుండపోత వర్షాలు - 18 గ్రామాలకు తెగిపోయిన సంబంధాలు



జార్సుగూడ, సుందర్‌ఘర్, నుపాడా, నబరంగ్‌పూర్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

**ఒడిశా (జర్నలిస్ట్ ఫైల్) :** ఒడిశాలో కుండపోత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండచరియలు విరిగిపడటంతో మల్కన్‌గిరి జిల్లాలోని 18 గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. దీనిపై అధికారులు మీడియాతో మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ బ్లాక్ పరిధిలోని బయపదర్ ఘాట్ రోడ్డులోని తుంబపదర్ గ్రామ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో మల్కన్‌గిరి, కోరాపుట్‌లోని లమటాపుట్, నందాపూర్ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తర ఒడిశాలోని గంగా మైదానాల్లో అల్పపీడనం ప్రభావంతో . జూలై 31 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బులెటిన్‌లో పేర్కొంది. ఆదివారం (నేడు) మల్కన్‌గిరి, కోరాపుట్, నబరంగ్‌పూర్, బోలంగీర్, నువాపాడా, సోన్‌పూర్, ఝుర్సుగూడ, సుందర్‌ఘర్, సంబల్‌పూర్, కియోంజర్, అంగుల్, డియోగర్, కలహండి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ కార్యాలయం తెలిపింది. ఆదివారం బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు. బార్‌గఢ్,

# అమర్‌నాథ్ యాత్ర సరికొత్త రికార్డు...



**శ్రీనగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** దక్షిణ కశ్మీర్‌లోని పర్వతాల్లో భూమికి 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకునే యాత్రికుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది గత సంవత్సరం రికార్డును బద్దలుకొడుతూ సరికొత్త రికార్డును సృష్టించింది. కేవలం 29 రోజుల్లో 4.51 లక్షల మంది ఈ యాత్రలో పాల్గొని అమర్‌నాథ్ గుహల్లోని మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. జూన్ 29న ఈ యాత్ర ప్రారంభం కాగా, కేవలం 29 రోజుల్లోనే ఈ రికార్డు సాధించినట్టు అమర్‌నాథ్ ఆలయ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) ప్రకటించింది. గత ఏడాది పూర్తి యాత్రాకాలంలో 4.45 లక్షల మంది అమరనాథుని దర్శించుకున్నట్టు తెలిపింది.

శనివారంనాడు సుమారు 8,000 యాత్రికులు అమరనాథుని దర్శించుకున్నారని, మరో 1,677 మందితో కూడిన బృందం జమ్మూలోని భాగ్‌వతి నగర్ యాత్రి నివాస్ నుంచి జమ్మూలోని పవిత్ర అమరనాథ గుహకు బయలుదేరిందని అధికారులు చెప్పారు. జూన్ 29న యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అతి తక్కువ సంఖ్యలో యాత్రికుల బృందం బయలుదేరడం ఇదే మొదటిదని, వీరిలో 408 మంది యాత్రికులు తెల్లవారుజామున 3.35 గంటలకు 24 వాహనాల కాన్వాయ్ ఎస్కార్ట్‌తో బయలు దేరారని, మరో 1,269 మంది 43 వాహనాల ఎస్కార్ట్‌తో సౌత్ కశ్మీర్ పహల్‌గావ్ బేస్ క్యాంపు నుంచి బయలుదేరారని వారు తెలిపారు. సీఏపీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసుల విస్తృత భద్రతా ఏర్పాట్ల కారణంగా ఈ ఏడాది యాత్ర సజావుగా, ప్రశాంతంగా జరుగుతున్నట్టు ఎస్ఏఎస్‌బీ ప్రకటించింది. 52 రోజుల పాటు సాగే అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 29వ తేదీతో ముగుస్తుంది. అదే రోజు శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పండుగలు జరుపుకొంటారు.

# ట్రైయాథ్లాన్ తొలి ట్రైనింగ్ సెషన్ రద్దు



**పారిస్ (జర్నలిస్ట్ ఫైల్) :** పారిస్ ఒలింపిక్స్‌కు సెన్ నది కాలుష్యం ఇబ్బందిపెడుతోంది. స్విమ్మింగ్ ట్రైయాథ్లాన్ తొలి ట్రైనింగ్ సెషన్‌ను ఒలింపిక్స్ నిర్వాహకులు రద్దు చేశారు. "నీటి నాణ్యతకు సంబంధించి సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నాం. ట్రైయాథ్లాన్ సన్నద్ధతను రద్దు చేస్తున్నాం. అథ్లెట్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నాం. సెన్ నది నీటి నాణ్యతను మరోసారి పరీక్షిస్తాం. ఎప్పుడు అనుమతి ఇస్తామనేది ఇప్పుడే చెప్పలేం" అని నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు. జులై 30న పోటీలు ప్రారంభం కానున్న వేళ.. ఈ ప్రకటన వచ్చింది. భారీగా వర్షాలు పడటం, శుద్ధి చేయని సీవేజ్ కలవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సెన్ నదిలో పోటీలను నిర్వహించడం సాధ్యం కాని పరిస్థితిలో నిర్వాహకులు వద్ద ప్లాన్- బి ఉన్నట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజులు పోటీలను వాయిదా వేయడం లేదా మారథాన్ స్విమ్మింగ్‌ను పారిస్‌కు తూర్పు దిక్కున ఉన్న మార్నె రివర్‌లో నిర్వహించడం వంటి ప్రణాళికలు ఉన్నాయి.

## జాతీయం/అంతర్జాతీయం

### సంస్థల బాధ్యతారాహిత్యమే ప్రధాన కారణం : రాహుల్ గాంధీ



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలోని రాజిందర్ నగర్‌లో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద పోటెత్తి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. పేలవమైన భవన నిర్మాణ ప్రణాళిక, భద్రతలేని నిర్మాణం, ప్రభుత్వ సంస్థల బాధ్యతారాహిత్యానికి సామాన్య ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని అన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ఘటన వ్యవస్థల సంయుక్త వైఫల్యం. అసురక్షిత నిర్మాణం, పేలవమైన భవన నిర్మాణ ప్రణాళిక, సంస్థల బాధ్యతారాహిత్యం వల్ల సామాన్య పౌరులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. సురక్షితమైన, సౌకర్యవంతమైన జీవితం ప్రతీ పౌరుడి హక్కు. దాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత" అని రాహుల్ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. కాగా ఢిల్లీ పోలీసులు ఆదివారం కోచింగ్ సెంటర్ యజమాని, సమన్వయకర్తను అదుపులోకి తీసుకున్నారు.

### వెనిజులా అధ్యక్ష ఎన్నికలు నేడు

- అంతర్జాతీయ పరిశీలకుల రాక
- మదురో , గొంజాలెజ్ మధ్యే పోటీ




**కారకస్ (జర్నలిస్ట్ ఫైల్) :** వెనిజులా అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈఎన్నికలు ఎంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు వెనిజులా ఎన్నికల సంఘం అంతర్జాతీయ పరిశీలకులను ఆహ్వానించింది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల నుండి వెయ్యి మంది దాకా పరిశీలకులు ఇప్పటికే వెనిజులా చేరుకున్నారు. అధ్యక్షుడు మదురోకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాల బహుళజాతి , కార్పొరేట్ ప్రచార బాకాలు అసత్య ప్రచారాన్ని అదే పనిగా సాగిస్తున్నాయి. ఒక అబద్ధాన్ని పది సార్లు వల్లిస్తే నిజమైపోతుందని పాశ్చాత్య మీడియా భావిస్తున్నట్లుగా ఉంది. షెడ్యూల్ ప్రకారం ఆరేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించడం, ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు దేశీయ, విదేశీ పరిశీలకులను రప్పించడం వంటివి ఎన్నికల్లో పారదర్శకతకు నిదర్శనమని ఎన్నికల సంఘం (సిఎన్ఇ) ప్రెసిడెంట్ ఎల్విస్ అమోరసా తెలిపారు. ఈ ఎన్నికల్లో పది మంది దాకా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ అధ్యక్షుడు మదురో, యూనిటరీ డెమొక్రటిక్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన ఎడ్మండో గొంజాలెజ్ మధ్యే ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. మొత్తం 2.1 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా
# స్వచ్ఛమైన పరిపాలన అందిద్దాం

### కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణ
### రాష్ట్ర గనులు, భూగర్భ, జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం ,జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్వచ్ఛమైన పరిపాలన అందించి, వారికి ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ జిల్లాను నెంబర్ వన్ స్థానంలో నిలబెడదామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులకు అభినందనలు, జడ్పిటిసి, ఎంపీపీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. ఎన్నో ఆశలతో ఎన్నో బాధల నుండి బయట పడాలని ప్రజలు 95% మాండేట్ ఇచ్చి గురుతర బాధ్యత మాపై ఉంచారని అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 కు 16 స్థానాలు కూటమి ప్రభుత్వానికి ఇచ్చారని అన్నారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాల్సిందని, బందరు పోర్టు పనులు వేగంగా పరిగెత్తించాలని, బిపిసిఎల్ కంపెనీ మన ప్రాంతంలో 60 నుండి 70 వేల కోట్ల పెట్టుబడులతో రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమ పాలన అందించాలని, అందుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలని, జిల్లాను నెంబర్ వన్ స్థానంలో ఉంచడానికి సంయుక్తంగా కృషి చేద్దామన్నారు.సభను ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిలో రోడ్లు తాగునీరు సమస్యలు పరిష్కరిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల స్వావలంబన కోసం కుట్టు మిషన్లు వంటి వాటిని అందించి వారి జీవనోపాధికి తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు, సమన్వయంతో జిల్లా అభివృద్ధి పథంలో నడుపుటకు కృషి చేస్తామన్నారు.జిల్లాలో నూతనంగా ఎన్నికైన అవనిగడ్డ, పామర్రు, గన్నవరం, గుడివాడ, పెడన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్ సభలో మాట్లాడుతూ వారి వారి నియోజకవర్గాల్లో సమస్యలు ప్రస్తావించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాల భవనాలు లేని చోట్ల మంజూరు చేయాలని, పాఠశాలల్లో టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని ఆట స్థలం సమస్యలు ఉంటే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ అంశాల్లో జరిగిన చర్చలో జిల్లాలో కాలువలు, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఇంతవరకు చేపట్టకపోవడంవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ప్రస్తావించగా, వచ్చే ఏడాది నుంచి ముందుగానే కాలువల నిర్వహణ పనులు, మురుగు కాలువలలో సిల్టు తొలగింపు పనులు చేపట్టేలా చూస్తామని మంత్రి, జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 25% సీట్లు పేదలకు కేటాయించేలా ప్రభుత్వ ఉత్తర్వులు



తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, రహదారులు తదితర అజెండా అంశాలపై సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులచే సమాధానాలు ఇప్పించి, సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి, జడ్పీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆయా మండలాల్లో తాగునీటి సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై పరిష్కార చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల్లో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి మంచినీటి కులాయి అందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో ఫాగింగ్ చేయడం నీటి నిల్వ కుంటల్లో డ్రైన్లలో ఆయిల్ బాల్స్ చల్లాలని తద్వారా దోమల నివారణ చర్యలు అమలు కావడం లేదని సభ్యులు ప్రస్తావించగా, ఫీజు రెగ్యులేషన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేయాలని జడ్పీ చైర్ పర్సన్ అధికారులను ఆదేశించారు జడ్పీటీసీలు వచ్చే ఆగస్టు 15 తేదీన జెడ్పి పాఠశాలల్లో జాతీయ జెండా ఎగరవేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరగా రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి అన్నారు.భారత మాజీ రాష్ట్రపతి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జడ్పీ సీఈవో ఆనంద కుమార్ తొలుత సభకు స్వాగతం పలికి అజెండా అంశాలు వివరించారు.ఈ సమావేశంలో కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, 3 జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియంహై స్కూల్ నందు
# అమ్మ పేరుతో మొక్క కార్యక్రమం



**బంటుమిల్లి,జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు శనివారం నాడు, పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష మరియు నేషనల్ గ్రీన్ కార్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శిక్ష సప్తహ్' కార్యక్రమంలో భాగంగా మరియు పర్యావరణ విద్య పథకంలో భాగంగా అమ్మ పేరుతో మొక్క అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణలోని ప్రధానోపాధ్యాయిని శ్రీమతి ఝాన్సీ సాబు మొక్కలు నాటి, విద్యార్థులచే మొక్కలు నాటించి విద్యార్థులకు అనేక సూచనలు తెలియజేస్తూ విద్యార్థి దశ నుండే మొక్కలు పెంచే అలవాటును అలవర్చుకోవాలని తద్వారా పర్యావరణ పరిరక్షణలో తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలని మరియు మనం నివసించే ప్రదేశాలలో తల్లిదండ్రులను పెద్దలను కూడా మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ విధంగా మనమే మన పర్యావరణాన్ని కాపాడుకోగలుగుతామని విద్యార్థులకు పర్యావరణం పై గల బాధ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమం అంతా స్కూల్ డైరెక్టర్ సాబుజాన్ పర్యవేక్షణలో జరిగింది.



## మొక్కలను ప్రతి ఒక్కరు
# శ్రద్ధగా సంరక్షించాలి



**నూజివీడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** అన్నే రామకృష్ణయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో శనివారం వనమహోత్సవము కార్యక్రమము నిర్వహించడం జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. రాధి కారాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుట్టినరోజున మొక్క నాటాలని తెలిపారు. గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు మాట్లాడుతూ తల్లి పేరుతో మొక్కను



నాటి సంరక్షించుకోవాలని తెలిపారు. శ్రీ పల్లగాని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలో గాని,ఇంటి దగ్గర గాని, గ్రామంలో గాని ప్రతి సంవత్సరము ఒక మొక్క నాటాలని తెలిపారు. మొక్క వలన ఆక్సిజన్ లభిస్తున్నదని తెలిపారు. మొక్కలు పెంచడం వలన పర్యవరణ సమతుల్యము ఏర్పడి సకాలంలో వర్షాలు కురుస్తాయిని విద్యార్థులకు తెలియ చేయడం జరిగినది. శ్రీ యలర్తి నరసయ్య మాట్లాడుతూ మనుగడకు ముఖ్యమైనది మొక్క. మొక్క పెరిగి వృక్షంగా తయారై అందరికీ నీడను ఇవ్వడం ఫలాలను అందించడం జరుగుతుంది. శ్రీమతి బండి విజయ రాణి మాట్లాడుతూ పకృతిని కాపాడే భాద్యత ప్రతి ఒక్కరి ది అని తెలిపారు. శ్రీమతి కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మొక్కలను పెంచి భావితరాల భవిష్యత్ కు బాటలు వేయాలని కోరారు. మొక్కలను పెంచండి పర్యావరణమును కాపాడాలని తెలిపారు. మొక్కలును పెంచి కాలుష్యాన్ని నివారించుకోవచ్చునని తెలిపారు. మొదట మొక్కను విద్యార్థి ధనుష్ కార్తికేయ తల్లి పావనీ నాగదీపిక చే మొదటి మొక్కను నాటించడంజరిగినది.ఈ కార్యక్రమంలో గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, పల్లగాని వెంకటేశ్వరరావు,యలర్తి నరసయ్య, కొచ్చర్ల వీర్రాజు, బండి విజయ రాణి, భావిశెట్టి వీరయ్య ట్రస్ట్ సభ్యులు ఉపాధ్యాయులు రవీంద్ర, మల్లేశ్వరి, కృష్ణవేణి, సౌజన్య ,మనోహరం, కోటేశ్వరమ్మ, జల్ది లక్ష్మి, మోహన్ రావు ,రంగారావు, సాకారవి, బాలు, పుల్లారావు నాన్ టీచింగ్ సిబ్బంది రవి, మరియమ్మ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మి పాల్గొన్నారు

# బాలలను సదాశయాల వైపు నడిపించాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక



**మచిలీపట్నం , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారిని ఉన్నత ఆశయాల వైపు నడిపించాలని, వారిని బాల్యం నుండే మంచి మార్గం వైపు తీర్చిదిద్దాల్సిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ అరుణాసారిక అన్నారు.శనివారం నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల హక్కుల న్యాయ చట్టాలపై నిర్వహించిన శిక్షణా తరగతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణా తరగతులను ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో దాదాపు 25 శాతం ఉన్న బాలల హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. ఉచిత నిర్బంధ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానవ అక్రమ రవాణా నిషేధం, వెట్టి చాకిరి నిర్మూలన, బాల బాలికలపై అకృత్యాల రక్షణ చట్టం (పోక్సో చట్టం), బాలల న్యాయం, బాల కార్మిక నిర్మూలన వంటి చట్టాలు బాలల సంక్షేమం, ప్రయోజనాలను సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయని తెలిపారు. బాలల సంక్షేమమే పరమావధిగా "ప్రత్యేక జువైనెల్ పోలీస్ యూనిట్లను" ఏర్పాటు చేసి ఆయా చట్టాలపై జిల్లా, గ్రామస్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల న్యాయ చట్టాల పట్ల మరింత అవగాహన కలిగించేందుకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణాకాలంలో అనేక విషయాలను తెలుసుకుని వాటిని విధి నిర్వహణలో అమలుపరిచే విధంగా బాలల పరిరక్షణకై పాటుపడాలని కోరారు.జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం, కుటుంబ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చెడు స్నేహాల ప్రభావంతో సమాజంలో బాలలు నేరప్రవృత్తి వైపు పయనించేందుకు ఎక్కువ ఆస్కారం ఉందని, బాలలు సన్మార్గంలో పయనించేందుకు తల్లిదండ్రులు, బంధువులు, టీచర్ల ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరం అన్నారు. బాలల న్యాయ చట్టాలపై పూర్తి



అవగాహన కలిగించుకుని వారిని సమాజానికి విలువైన వారిగా తయారు చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల సేవనం దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ పి రామ్మోహన్ రెడ్డి, హెల్ప్ ఎన్జీవో సెక్రెటరీ ఎమ్మెస్ రామ్మోహన్, ఇతర పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి హైస్కూల్లో తల్లికి వందనం కార్యక్రమం



**నూజివీడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ చొరవతో తలపెట్టిన తల్లికి వందనం " కార్యక్రమం, నూజివీడు మండలం గొల్లపల్లి, అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పి. రాధిక రాణి,మాజీ సర్పంచ్ గోగినేని



శ్రీనివాస్ కుమార్ అప్పారావు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు - తల్లిదండ్రులు,బిజెపి, టిడిపి,జనసేన, వైసిపి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పచ్చదనం గురించి, అమ్మ ప్రేమ గురించి, వాతావరణ కాలుష్యం వల్ల పొంచి ఉన్న ప్రమాదం గురించి వక్తలు వివరించారు. అందుకే పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క ను పెంచాలని కోరారు. రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్ వారు ఈ పచ్చిదనం రక్షణ కు తగువిధంగా సహకారం అందించాలని కోరారు.

## జెండా ఆవిష్కరణ కార్యక్రమం
# విజయవంతం చెయ్యండి

**నూజివీడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ పార్టీ కమిటీ సమావేశం రమణక్కపేట గ్రామంలో జరిగింది. కామ్రేడ్ చారు మజుందార్ 52వ వర్ధంతి మరియు 50వ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జెండా ఆవిష్కరణ జులై 28-29-30 తేదీలలో జరుపుకోవాలని కమిటీ అభిప్రాయ పడింది. కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ రమణక్కపేట, చెక్కపల్లి, గుల్లపూడి గ్రామాలలో జెండా ఆవిష్కరణ జరుగుతాయని ఈ కార్యక్రమానికి సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టారు.అరుంధతి నగర్ దళిత కాలనిలో సమస్యలు వేల్లునునుకొని పోయాయని సమస్యలను కుటమి ప్రభుత్వం అమలు జరపాలని డిమాండ్ చేస్తూ సర్వే నంబర్: 260 లో పేదల సాగు భూములకు అసైన్మెంట్ కమిటీ జరిపి అడవి క్లాసిఫికేషన్ మార్చి పట్టాలు మంజూరు చేయాలని,సర్వే నంబర్ 249 లో సాగుదారుల రికార్డుల ప్రకారం సర్వే జరిపి అందులో దళితులు ఉపయోగించుకుంటున్న స్మశాన భూమిని సరిహద్దులు గుర్తించి రికార్డులలో నమోదు చేయాలని, జాతీయ ఉపాధి హామీ పథకం వేతనాలు రెండున్నర మాసాలుగా చెల్లించాలని,తూర్పు



దళిత వాడకు మినీ అంగన్వాడి సెంటర్ ను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్వాడి సెంటర్ కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని,ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలని, కాల్వపై వంతెన నిర్మాణం చేపట్టి రహదారిని సర్వే జరిపించాలని,కమ్యూనిటీ భవనము మంజూరు చేయాలని, జిల్లా పరిషత్ ఆట స్థలమును ఆక్రమణ తొలగించి పాఠశాలకు స్వాధీనపరచాలని,చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మాణం చేపట్టాలని కాలనీలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, పశువులు ఆస్పత్రికి నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణం చేపట్టాలని,గ్రంథాలయంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

కమిటీ ఏకగ్రీవంగా తీర్మానలను ఆమోదించింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం,అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆమదాల చినబాబు,వేముల చంటి, వేముల మహాలక్ష్మి,నందిపాము రాణి, ధారా బేబిషాలని, ఆముదాల సురేష్,ఆముదాల విజయలక్ష్మి ,ఆముదాల రాజేష్ ,అరకుట్ల సింధుజ ,అరకుట్ల సహృది ,నందిపాము కుమారి, ఆముదాల సునీత, పల్లిపాము భవాని, ఆమదాల పార్వతి, ఆముదాల పుష్పలత ,ఆముదాల వజ్రం , జుజ్జువరపు పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ట్రిపుల్ ఐటీలో
# వైస్ ఛాన్సలర్ డైరెక్టర్లను నియమించాలి

### ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



**నూజివీడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నూజివీడు త్రిబుల్ ఐటీ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శివారెడ్డి రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ చిన్నం ప్రీతి లు మాట్లాడుతూ నూజివీడు త్రిబుల్ ఐటీ నందు వైస్ ఛాన్సలర్ లేకపోవడం విద్యార్థుల



సమస్యలను తెలుసుకునే నాథుడే లేకపోయారన్నారు హాస్టల్ నందు సరైన భోజనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డైరెక్టర్ గారికి విద్యార్థులు చెప్పిన వాటిని పరిష్కారం చేయడం లేదన్నారు తక్షణమే త్రిబుల్ ఐటీలలో వైస్ ఛాన్సలర్ డైరెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు విద్యార్థులను బూతులు తిడుతున్న హాస్టల్ వార్డెన్ సుబ్బలక్ష్మి గారిని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు క్యాంపస్ లో మద్యం సరఫరా పై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సరఫరా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విద్యార్థుల ఆరోగ్యాలని కాపాడాలని డిమాండ్ చేశారు అనంతరం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ గారిని కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందిస్తూ నూతన వైస్ ఛాన్సలర్ రాగానే అన్ని సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా నాయకుడు సాదిక్ ఎన్టీఆర్ జిల్లా నాయకుడు సురేష్ నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# సూర్యలంకలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల డీఎస్పీ



బాపట్ల , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : వారాంతాల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో యాత్రికులు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లకు వచ్చే అవకాశం ఉందని, దానికి తగిన విధంగా భద్రత చర్యలు తీసుకోవాలని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎవరైన యాత్రికులు ప్రమాదాలకు గురైతే రక్షించడానికి సముద్ర తీరాలలో గజ ఈతగాళ్లను అప్రమత్తంగా ఉంచాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధి కారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం బాపట్ల డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించారు. పోలీస్ ఔట్ పోస్ట్ ను, టవర్స్ ను పరిశీలించారు. ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని గజ ఈతగాళ్లను ఆదేశించినారు. సముద్రంలో నిర్దిష్ట లోతులో ఏర్పాటుచేసిన ఎరుపు రంగు జెండాలను దాటి యాత్రికులు ఎవరు సముద్రంలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా యాత్రికులను అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, మెరైన్ సిబ్బంది సముద్ర తీరంలో సమర్థవంతంగా గస్తీ విధులు నిర్వహించాలన్నారు. మద్యం సేవించి ఎవరు సముద్రంలోకి దిగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎవరైనా ఆకతాయిలు యాత్రికులను ఇబ్బందులకు గురి చేస్తున్నా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వెంటనే వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించినారు. యాత్రికులు పోలీస్ అదికారులు, సిబ్బంది యొక్క సూచనలు పాటిస్తూ సముద్ర తీరంలో ఆహ్లాదకరంగా గడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి తో పాటు బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, మెరైన్, ఇతర పోలీస్ అదికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్ళ ఉన్నారు.

# బదిలీపై వెళుతున్న తహసీల్దార్ ని ఘనంగా సన్మానించిన విఆర్ఓలు



జె.పంగులూరు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : సాధారణ ఎన్నికల బదిలీలలో నెల్లూరు జిల్లా నుండి బదిలీ పై జె.పంగులూరు మండలానికి తహసీల్దార్ గా వచ్చిన జియస్ కృష్ణ ప్రసాద్ ఎన్నికల అనంతరం మరల నెల్లూరు జిల్లా కు బదిలీ అయినా సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం లో విఆర్ఓ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ లు ఆదినారాయణ, భాగ్యరాజ్ లు మాట్లాడుతూ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ ఎన్నికలు విధులు సక్రమంగా నిర్వహించారాని. రెవిన్యూ కార్యకలాపాలు మండలం లో ఎలాంటి ఆటంకాలు లేకుండా పనిచేసారని కొనియాడారు ఆఫీస్ సిబ్బంది ని వీఆర్వోలను విఆర్ఏ లను సమభావంతో చూశారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమం లో డీటీ లు ఆదినారాయణ, భాగ్యరాజ్, విఆర్ఓ లు రవికుమార్, వెంకటేశ్వర్లు, బుల్లియ్య, దుడ్డు అంజయ్య చింపారావు.వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు శ్రీనివాస్, దాస్, సాల్మన్, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో నగర అభివృద్ధిని మరిచిన వైసీపీ నేతలు

## పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నేతలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడి అభివృద్ధిని నిర్లక్ష్యం చేసారని, టీడీపీ కార్పొరేటర్లు గెలిచిన కక్షగట్టి పనులు చేయలేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవీ ఆగ్రహం వ్యక్తం చేసారు. శనివారం 35వ డివిజన్ లోని కృష్ణానగర్ 1వ లైన్ నుండి మెయిన్ రోడ్డు) నుండి 1వ అడ్డరోడ్డు వరకు 15 లక్షల రూపాయల అంచనాలతో సిసి రోడ్డు నుండి నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రధాన ప్రాంతాల్లో ఒక్కటయ్యిన కృష్ణానగర్ లో కనీస మౌలిక సదుపాయాలయిన సిసి రోడ్లు కూడా నిర్మించకుండా వైసీపీ నేతలు కక్షగట్టారని, ఎన్నో ఏళ్లుగా బిటి రోడ్డుగా ఉన్న రోడ్డు ధ్వంసమయి గుంతలమయంగా ఉన్న కూడా కనీస ప్యాచీవర్కులు చేయకుండా ఉన్నారంటే వీళ్ళ మానసిక పరిస్థితి ఏమిటో ప్రజలు గ్రహించే వారిని ఇంటికి పరిమితం చేసారని, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కక్షలకు తావు లేదని, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తానని, అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతానని గళ్ళా మాధవి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, కోవెలమూడి రవీంద్ర, చెరుకూరి తిరుపతి రావు, వనమా నరేంద్ర, జెట్టిబాబు, బి.సాంబయ్య మరియు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించడం శ్రీరామ రక్ష



చీరాల, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం శ్రీరామ రక్షా లాంటిదని చీరాల పీ ఎల్ వి షేక్. మహబూబ్ సుభాని అన్నారు.శనివారం మండల న్యాయ సేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో వేటపాలెం మండలం, రామన్నపేట పంచాయతీ పరిధిలోని, రావూరిపేట సచివాలయం 2 వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ న్యాయవాది చిక్కాల రామారావు మాట్లాడు తూ ద్విచక్ర వాహన చోదకులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించని యెడల శిక్షార్హులవుతారని ప్రస్తుతం భారీగా జరిమానాలు ఉంటు న్నాయని బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లు, మైనర్లు డ్రైవింగ్ చేయటం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం, తదితర నేరాల నుంచి దూరంగా ఉండాలని తెలిపారు. సోషల్ వర్కర్ , పి యల్ వి యస్.డి.మతీన్ మాట్లాడుతూ యువత చట్టానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ క్రమశిక్షణతో మెలగా లని ఆకాంక్షించారు. పంచాయతీ కార్యదర్శి జి సారధి మాట్లా దుతూ ఐ ఎస్ ఐ మార్క్ గల హెల్మెట్లనే ధరించాలని తెలిపారు. వీఆర్వో డి పురుషోత్తం ప్రజలు పాల్గొన్నారు .

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత డీఈవో



జె.పంగులూరు , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి 4వ వార్షి కోత్సవం సందర్భంగా జిల్లా లోని అన్ని పాఠశాలల్లో "శిక్షా సప్తాహ్" కార్యక్రమము నిర్వహించాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు తెలిపారు శనివారం పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందుపర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థి తల్లిదండ్రుల చేత మొక్కలను నాట డం జరిగినది. ఈ సందర్భంగా డిఇఓమాట్లాడుతూపాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్ ల ఏర్పాటు, విద్యార్థులు తల్లులు మాతృ భూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం చేయడం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు సమాజం లో ప్రతి ఒక్కరు ఉంది అన్నారు మండల విద్యాశాఖ అధికారులు నాగభూషణం గోగుల వీరాంజ నేయులు మాట్లాడుతూ మండలములోని అన్ని పాఠశాలలో అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కల నాటి కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా మొక్కల నాటి పర్యావరణాన్ని పెంపొందించవచ్చు అన్నారు ఈకార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం అందరూ రక్తదానం చేయాలి

## విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



గుంటూరు , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమాని, విద్యార్థులు అందరూ రక్తదానానికి పూనుకోవాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపు నిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులు రక్తదానం చేశారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్ ఎస్ఎస్ విభాగం వారు జీజీహెచ్ గుంటూరు, నీడ్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, తలసేమియా నీడ్స్ బ్లడ్ బ్యాంక్ల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా తిరిగి భర్తీ చేసుకుంటుందని వెల్లడించారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందని వెల్లడించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. రక్తదానం వల్ల నేడు ఎంతో మందిని వైద్యులు బతికించగలుగుతున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా, విజ్ఞాన్స్ ఫార్మసీ కాలేజికి చెందిన 400 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసారు. అంతేకాకుండా తెనాలి చెంచుపేటలోని యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్కు, కోయవారిపాలెం వృద్ధాశ్రమానికి, గాంధీ ఆశ్రమానికి, రెండు బ్లైండ్ స్కూల్స్ ( షిరిడి సాయి బ్లైండ్ స్కూల్, కళాభారతి బ్లైండ్ స్కూల్), చిన్నపిల్లల ఆశ్రమానికి నిత్యవసర సరుకులు, దుప్పట్లు, చీరలు అందజేసారు. వేజండ్ల, జాగర్లమూడి, అంగలకుదురు, నారాకోడూరు ప్రభుత్వ స్కూల్స్లో విద్యార్థులకు కాంపిటీషన్స్ నిర్వహించి బహుమతులు అందజేసారు. వీరనాయకుని పాలెంలో మెడికల్ క్యాంప్ను నిర్వహించారు. నేడు వడ్లమూడిలో కంటి చెకప్ క్యాంప్ను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్సస్ విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఆగస్టు15న ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్



అద్దంకి , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : నూతనంగా రాష్ట్రంలో ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్రంలో నందమూరి తారక రామారావు పేరుతో ఉన్న అన్న క్యాంటీన్ లను పునర్ ప్రారంభించాలని నిర్ణయించడం జరిగింది ఇందులో భాగం గా అద్దంకి పట్టణంలోని ఒంగోలు రోడ్ ఎన్ఎస్ పి ఆఫీస్ వద్ద గల అన్న క్యాంటీన్ ని మరమ్మత్తులు చేసి స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తు న్నట్లు అద్దంకి మున్సిపాలిటీ కమిషనర్ ఎం సత్యనారాయణ ఒక ప్రకటన తెలిపారు వారు మాటాడుతూ ఈ అన్నా క్యాంటీన్ లో మహిళా మార్ట్ నీ గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది దీని తొలగించి మరమ్మత్తలను చేసి అద్దంకి ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం ఈ క్యాంటీన్ ద్వారా ఏర్పాటు చేయడానికి చురుగ్గా పనులు జరుగుతున్నాయని తెలిపారు.

# పంటసాగు ధ్రువీకరణ పత్రాల కొరకు భూయజమానులు కౌలురైతులకు సహకరించాలి



కొరిశపాడు , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : పంట సేవ చేసుకునే కౌలు రైతులకు భూమి యజమానులు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి, డాక్టర్ వై రామకృష్ణ తెలిపారు.భూయజమానులు నష్టపోకుండా పంట సాగు దారుల చట్టం 2019 చట్టం ద్వారా వారికి ఎలాంటి నష్టం జరగకుండా చట్టంలో సవరణ చేసినందున భూమి యజమానులు కౌలురైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు వచ్చే లాగున సహకరించాలని డిబిఆర్ సి బృందం జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ వై.రామకృష్ణను కోరారు.దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బి రమణమూర్తి మరియు రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కౌలు రైతుల పంట సాగు దారుల గ్రామస్థాయిలో భూ యజమానుల వద్ద నుండి సాగు చేస్తున్న కౌలు భూముల సాగుపై మాత్రమే కౌలు రైతుకు హక్కు ఉంటుంది, భూమిపై కాదని ఈ విషయాన్ని భూ యజమానులు గుర్తుతెరిగి కౌలు రైతులకు సహకరించాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు సహకారంతో పంట సాగు ధ్రువీకరణ పత్రాలు(సిసిఆర్ సి) తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నగదు, పంటల బీమా, ఇన్ పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు పొందటానికి కౌలు రైతులకు ఎక్కువ అవకాశం ఉన్నందున,ప్రతి కౌలు రైతు పంట సాగు ధృవీకరణ పత్రాలు పొందాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు ఎన్ శ్రీలత, వి.భగవాన్ దాస్ పాల్గొన్నారు

# గుంటూరులోని సిటీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు



గుంటూరు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : గుంటూరు నగరంలో తిరుగుతున్న ప్రైవేట్ సిటీ బస్సులపై శనివారం సాయంత్రం ఆర్.టి.ఎ. అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు నగరంలో ప్రైవేట్ సిటీ బస్సుల పై రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘిస్తూ మరియు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని తరచూ ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో గుంటూరు ఆర్.టి.ఏ. అధికారులు నగరంలో శనివారం నాడు ప్రత్యేకత తనిఖీలు నిర్వహించి 20 సీటీ బస్సులపై కేసులు నమోదు చేయడమైనది. అందులో కండక్టర్ లైసెన్సులు లేకుండా నాలుగు కేసులు, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై ఒక కేసు, మల్టీటోనే హారన్ కలిగిన వాహనాలపై ఏడు కేసులు, ఇతర నిబంధనలు ఉల్లంఘించినందుకు 8 కేసులు నమోదు చేయడమైనది. ఈ తనిఖీలలో డిటిసి షేక్ కరీం ఆర్టీఓ జి గోపాల్, ఎం.వి.ఐ లు రాఘవరావు, అనిల్,బాలకృష్ణ, సౌజన్య మల్లీశ్వరి, ఏయంవిఐ లు ఉషా కిరణ్, పవన్, మధుసూదన్ రావు అమృతరాణి, సిబ్బంది పాల్గొన్నారు. సిటీ బస్సుల యజమానులు తమ బస్సులను రహదారి భద్రత నిబంధనలను అనుగుణంగా నడపాలని, బస్సులను రోడ్లపై అడ్డంగా నిలపరాదని, సౌండ్ పొల్యూషన్ అమర్చరాదని హెచ్చరించడమైనది. రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించే అన్ని రకాల వాహనాలపై తనిఖీలు కొనసాగుతాయని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు.

# త్వరలో అందుబాటులోకి అద్దంకి పట్టణ ఆరోగ్య కేంద్రం



అద్దంకి , జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : అద్దంకి పట్టణం రేణింగవరం రోడ్ లోని రెండవ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోటి 21 లక్ష వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించడం జరుగుతుందని అద్దంకి మున్సిపాలిటీ కమిషనర్ ఎం సత్యనారాయణ తెలిపారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం అద్దె భవనంలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్యం అందిస్తూ ఉన్నారు గత ప్రభుత్వంలో 70 శాతం నిర్మాణ పనులు జరిగినవి మిగిలిన పనులను శరవేగంగా నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ఆరోగ్య కేంద్రాన్ని అద్దంకి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వాతావరణం మార్పు వలన ప్రస్తుతం సీజనల వ్యాధులు ప్రజలను చాలా ఇబ్బందులు గురి చేస్తున్నావి వీటిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య కేంద్రాన్ని వచ్చే నెలలోనే ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామన్నారు.

## పాఠశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలి

కొరిశపాడు/బల్లికురవ, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : బాపట్ల బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన 40 మంది విద్యార్థులు అదే మండలంలోని కొప్పెరపాడు హైస్కూల్లో చదువుతున్నారు. గ్రామానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడం వలన విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అందుకే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని అద్దంకి డిపో మేనేజర్ కి కొత్తూరు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్నందున ఉదయం 8:15 కి వెంపరాల ఉప్పలపాడు మైలవరం కొత్తూరు మీదగా కొప్పరపాడు వరకు సాయంత్రం 4:30 కొప్పరపాడు నుంచి కొత్తూరు మీదుగా మైలవరం ఉప్పలపాడు వెంపరాల కి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిపోమేనేజర్ కు విన్నవించుకున్నారు .దీనివలన నాలుగు గ్రామాల మధ్యలో ఉన్న మైలవరం హైస్కూల్, కు ఉప్పలపాడు విద్యార్థులు కొప్పెరపాడు హైస్కూల్ కి కొత్తూరు విద్యార్థుల రవాణా సమస్య పరిష్కారం అవుతుందని ముఖ్యంగా బాలికలు బస్సు సౌకర్యం లేకపోవడం వలన చాలా మంది డ్రాప్ అవుట్ అవుతున్నారు. ఉదయం ఒక ట్రిప్పు సాయంత్రం ఒక ట్రిప్పు సమయానికి ఆర్టిసి బస్సు కొత్తూరు మైలవరం ఉప్పలపాడు వెంపరాల వరకు నడపాలని ఆయా గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు.

# పాఠశాలల్లో పోషణ దినోత్సవం ఎంఈఓ



అద్దంకి, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు పాఠశాలలో పోషణ దినోత్సవ (న్యూట్రిషన్ డే ) సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అద్దంకి మండల విద్యాధి కారులు డి. గంగాధర్ రావు బి సుధాకర్ ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ నేటి సమాజ ఓంలో మొక్కలపై ప్రజలకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా ప్రతి ఉపాధ్యాయులు విద్యార్థులకువిషయాలను వివరించాలి ఎందుకంటే రాబోయే రోజుల్లో ఈ చెట్టు కింద ఉండాలంటే అద్దె కట్టి మరీ కూర్చునే పరిస్థితులు ఏర్పడతాయి ఎందుకంటే స్వచ్ఛమైన గాలిని ప్రకృతిలో మనకు మొక్కలు అందిస్తాయి కాబట్టి ఈ మొక్కల యొక్క ఆవశ్యకతను ప్రతి విద్యార్థి అర్థం చేసుకునేల చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఈఈఆర్డి సేవా సంస్థ అధ్యక్షులు బి.కిరణ్ చంద్ మాట్లాడుతూ మన పూర్వీకులు వైద్య విధానములో ఔషధం మొక్కలు కీలక పాత్రను పోషించాయి నేటి సమాజంలో ఔషధ మొక్కల పై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన అనారోగ్య పాలవుతున్నారని తెలియపరిచారు. ఔషధ మొక్కలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా రాబోయే రోజుల్లో ఆయుర్వేదంలో నిష్ణాతులు అయినటువంటి వైద్యులతో ఉచిత అవగాహన శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలందరినీ ఆరోగ్యవంతులుగా చేయడమే ఐ ఈ ఈ ఆర్ డి లక్ష్యమని తెలిపారు. ఈరోజు మండలం లోని తిమ్మాయపాలెం బొమ్మనంపాడు లో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల పరిషత్తు పాఠశాలలో వేప తులసి అలోవీర అశ్వగంధ బ్రహ్మి, ఉసిరి తమలపాకు ఎర్రచందనం ఇన్సూరెన్స్ ప్లాంట్ రణపాల, నల్ల పసుపు పుదీనా సన్న ఔషధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి. గంగాధర్ రావు శ్రీనివాస్ మూర్తి ఉపాధ్యాయులు సీఆర్పీలు పాల్గొనడం జరిగింది.

# టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకి నివాళులు



గుంటూరు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి యన వర్ధంతిని పురస్కరించుకొని నివాళులు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్. తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బత్తుల హేమంత్ మాట్లాడుతూభారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత రత్న ఏ పీ జే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన కు ఘన నివాళి అర్పిస్తున్నాను. క్షిపణి శాస్త్ర విజ్ఞానం రంగంలో చిరస్మరణీయ సేవలు అందించిన కలాం దేశ యువతకు ఆదర్శప్రాయులు. ఆ మహనీయుని జీవితాన్ని మన విద్యార్థులు స్ఫూర్తి పొందుదాం. అని అన్నారు. టి ఎన్ టి యు సి అధ్యక్షులు విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ భారత రత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం పుస్తకాలు తన స్నేహితులుగా చేసుకొని మన దేశానికి ప్రధాని స్థాయి దాక వెళ్లారు ఆయన్ని మన విద్యార్థులు మరియు యువతరం ఆదర్శంగా తీసుకోవాలని కోరుకుంటున్నాను భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి.. రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు, భారతరత్న, నివాళులు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మండూరి వెంకటరమణ, టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు శిరీష్, ప్రధాన కార్యదర్శి హరీష్, కోశాధికారి గోపి, కార్యనిర్వ కార్యదర్శి రాకేష్ , టిఎన్ఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, అఖిల్, భాస్కర్ మరియు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిని
# కలిసిన నీరుకొండ



**కోరుకొండ, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని, భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం మధురపూడి విమానాశ్రయంలో భువనేశ్వరిని కలిశారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు గోదావరి జిల్లాకు ఆమె తొలి సారిగా విచ్చేసిన సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. నారా భువనేశ్వరి రాజమహేంద్ర వరం నుండి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని, శనివారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా వీరన్న చౌదరి విమానాశ్రయంలో కలిసి కొద్దిసేపు చర్చించారు.

### రంపచోడవరంలో
# బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం

కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహణ
ముఖ్యఅతిధిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత హాజరు



**గోకవరం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మహిళలు అందరూ సుఖసంతోషలతో ఈపండుగను చేసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో హిందూ మతాన్ని రక్షించు కోనేందుకు, హిందూ ధర్మాన్ని, మహిళలను ప్రోత్స హించేందుకు, బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమంకు రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని వేల సంవత్సరాల క్రితమే ప్రస్తుతం ఉన్న వైద్య విధానాలు, ఖగోలానికి సంబందించిన్నవి కనుగొన్న ఘనత హిందువులదే అని అన్నారు. అనంతరం బంగారు వరలక్ష్మి కానుక డ్రా తీసి 40 మంది విజేతలకు బంగారు లక్ష్మీదేవి రూపులను, ప్రశంసా పత్రాన్ని పంపిణి చేశారు. ఈకార్యక్రంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరావు, దాసరి తమ్మన్న దొర, బిజెపి పార్టీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మహిళలు పాల్గున్నారు.

### యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి
# ఉన్నత లక్ష్యాలు సాధించాలి



**బంటుమిల్లి, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు సాధించాలని బంటుమిల్లి మండల న్యాయ సేవా సాధికార కమిటీ చైర్మన్ మరియు బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎం భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో న్యాయ సేవ సాధికార కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవా సాధికార కమిటీ చైర్మన్, మెజిస్ట్రేట్ ఎం భాస్కరరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో వారి ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న పలు సామాజిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మేజర్ అయిన తర్వాత మాత్రమే వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాద ఘటనలలో సుమారు 90 శాతం హెల్మెట్ లేకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఇందుకు విద్యార్థులు వారు హెల్మెట్ వినియోగించడంతోపాటు చుట్టుపక్కల వారికి మరియు తల్లిదండ్రులకు హెల్మెట్ వినియోగం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్పీడ్ మరియు ర్యాష్ డ్రైవింగ్ కూడా చేయరాదని, తద్వారా ఎదుర్కొన్న సమస్యల గురించి వివరించారు. మానవుల అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి సామాజిక బాధ్యత గుర్తు ఎరిగి అందుకు అనుకూలంగా నడుచుకోవాలన్నారు. అలాగే బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గల మండల న్యాయ సేవా సాధికార కమిటీని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ న్యాయ సేవా సాధికార కమిటీ ద్వారా కేవలం వారి సమస్యను ఒక తెల్ల కాగితంపై కూడా రాసి కమిటీ దృష్టికి తీసుకురావచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు), పళ్లెం వీర వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి రాంబాబు, ఈవీఎస్ రాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు తదితరులు ఉన్నారు.

### గృహ హింస, వరకట్న
# నిరోధక చట్టాలపై అవగాహన

**ఆగిరిపల్లి, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :**



ఆగిరిపల్లి గ్రామం స్థానిక ఎం వి ఎన్ వైవియన్ కళాశాలలో కాఫీ నూరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో మసీదు ఏరియా లోని అంగన్వాడీ కేంద్రంలో మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక అవగాహన సదస్సులో మహిళలకు గృహహింస నుండి మహిళలకు రక్షణ చట్టం 2005 కేంద్ర ప్రభుత్వ చట్టం నెంబర్ 43/2005 గురించి అవగాహన కల్పించారు. ఏ సి డి పి ఓ డివివి నాగేశ్వరరావు సూపర్వైజర్ రాగమయి మాట్లాడుతూ ఆడపిల్లలకు, మహిళలకు గల చట్టాల గురించి ,బాలికలకు బాల్యవివాహాల నిరోధక చట్టం యాక్ట్ పిసిపి ఎన్ డి యాక్ట్, వరకట్న నిరోధక చట్టం, మొదలగు చట్టాల పై అవగాహన కల్పించారు.

### నన్నయ్య పూర్వపు వీసీ
# మొక్కా జగన్నాథంపై విచారణ

విచారణ కమిటీలో ఇద్దరు సభ్యులు.
15 రోజుల్లోగా నివేదిక ఇవ్వండి..
ఉన్నత విద్యా మండలి ఆదేశాలు...
పూర్వపు వీసి పై మాజీ ఓఎస్డి చేసిన ఫిర్యాదు పై స్పందించిన ప్రభుత్వం







**రాజమహేంద్రవరం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు వీసీగా పని చేసిన డాక్టర్ మొక్క జగన్నాథం పై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన విషయం విధితమే. పూర్వపు వీసి మొక్క జగన్నాథం, నన్నయ్య విశ్వవిద్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు అనేక అవకతవకులకు పాల్పడినట్లు ఇదే విశ్వవిద్యాలయంలో పూర్వపు ఓఎస్డిగా చేసిన ఏ ఎస్ బి ఎస్ సాంకృత్యాయన్ ఉన్నత విద్యా మండలకి రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సాంకృత్యాయన్ ఫిర్యాదులోని కొన్ని ప్రాథమిక అంశాలు వాస్తవానికి దగ్గరగా ఉండడంతో ఉన్నత విద్యా మండలి స్పందించి నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వపు వీసి మొక్క జగన్నాథం పై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఎంక్వైరీ కమిటీని నియమించింది. ఈ కమిటీలో జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఎన్.వి.రెడ్డి. ఎన్.వి.రెడ్డిలను నియమించింది. ఉన్నత విద్యా మండలి నుండి జారీ అయిన ఆదేశాలు అందిన రోజు నుండి 15 రోజులలోపు దాని నివేదికను సమర్పించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కమిటీకి అయ్యే ఖర్చును కూడా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్ర వరం నిధుల నుండి భరించాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పూర్వపు వీసీ మొక్క జగన్నాథం పై గతంలో వచ్చిన ఆరోపణలు ఇవే..ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈసీ (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) ఆమోదం తీర్మానాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అవుట్ సోర్సింగ్ ముసుగులో ఉద్యోగాలు భర్తీ, ఈసీ సమావేశంలో ప్రస్తావన లేకుండా కాంట్రాక్ట్ పనులు కేటాయింపు, నిధులు దుర్వినియోగం, ఇష్టా రాజ్యంగా స్పాట్ వాల్యూషన్ ప్రక్రియ వంటి పలు అంశాలు ఉన్నాయి.

### మైలవరం సబ్ డివిజన్లో
# మహిళా పోలీసులకు వర్క్ షాప్



**మైలవరం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** మైలవరం సబ్ డివిజన్లో మహిళా పోలీసులకు సైబర్ నేరాలు, రుణ యాప్ తదితర అంశాలపై వర్క్ షాప్ నిర్వహించారు. విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ రూరల్ ఇంచార్జ్ డిసిపి హరికృష్ణ సూచనలపై మైలవరం సబ్ డివిజన్ ఏసిపి ఎస్ మురళీమోహన్ అధ్యక్షతన శనివారం స్థానిక ఏసిపి కార్యాలయం నందు సబ్ డివిజన్ లోని మహిళా పోలీస్ లకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ నందు ఉమెన్స్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, డ్రగ్ అబ్యూస్ వంటి అంశాలపై విపులంగా అవగాహన కల్పించి వాటిని గ్రామాలలో ప్రజలకు అవగాహన ఏ విధంగా కల్పించాలి, తద్వారా నేరాల నియంత్రణ ఏ విధంగా చేపట్టాలి అని వివరంగా విశ్లేషించారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు సంబంధించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై సవివరంగా తెలియజేస్తూ స్కూలు, అంగన్వాడి మరియు కాలనీస్ లలో ఆయా పిల్లలకు ఏ విధంగా అవగాహన కలిగించాలో తెలియజేశారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు అనగా ఓటీపీ ఫ్రాడ్, పాస్వర్డ్, ఐడెంటిటీ తెఫ్ట్, ఫేక్ పోలీస్, లోన్ అప్స్, ఫేక్ జాబ్ ఆఫర్స్, ఫేక్ వర్క్ ఫ్రం హెూం జాబ్స్, ఆన్లైన్ ట్రేడింగ్, ఆన్లైన్ గేమింగ్ వంటి వాటి గురించి వివరించి ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలో తెలియజేశారు. మరీ ముఖ్యంగా యువత సెల్ ఫోన్ల యందు సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ లలో అనగా ఫేస్బుక్, యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ లలో వచ్చే యాడ్స్ చూసి అది నిజమే అనుకుని సదరు లింక్స్ క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్ల వ్యాప్ పోర్టల్లోకి వెళ్లి మోసాల బారిన పడకుండా అవగాహన కలిగించాల్సిందిగా ఆదేశించారు. యువత గంజాయి బారిన పడి చెడు మార్గంలోకి జారిపోకుండా అవగాహన కల్పించడం, మరియు గంజాయి సరఫరా పెడలింగ్ ఇతరత్రా నేరస్తుల సమాచారము నిఘా పై చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు కొత్తూరు, తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ అబ్దుల్ నబీ మరియు సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సిడబ్ల్యూపి మచిలీపట్నం డివిజన్ ట్రెజరర్గా
# యు పి ఆర్ విటల్ ఎన్నిక



**బంటుమిల్లి, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ స్ ఎన్నికలలో మచిలీపట్నం డివిజన్ స్థాయిలో కోశాధికారిగా యూపీఆర్ విఠల్ ఎన్నికయ్యారు .అధ్యక్షులుగా భాను ప్రసాదు కార్యదర్శిగా కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యా రు. ఈ ఎన్నికలు జోనల్ ప్రెసిడెంట్ సోమ నరసయ్య జోనల్ కార్యదర్శి ధనుంజయ ఆశ్చర్య ఆల్ ఇండియా ఈసీ నెంబర్ అరవింద్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ మోహన్ రావు జోనల్ కోశాధికారి కోటేశ్వరావు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కృష్ణ గుంటూరు జిల్లాల సి ఎల్ ఐ లీడర్లు పాల్గొన్నారు.

### రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని
### మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీపీ నాగలక్ష్మి చెన్నారావు



**ఏ. కొండూరు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శనివారంతాడేపల్లి లోని తన నివాసంలో ఏ. కొండూరు మండల ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్ల మీ పరిపాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని ఖరీఫ్ సీజన్లో రైతన్నలకు రైతు భరోసా పథకం ద్వారా సకాలంలో వారి బ్యాంక్ ఖాతాల్లో సొమ్ములు వేసి రైతాంగాన్ని ఆదుకున్న మహెూన్నత నాయకత్వం మీదేనని కొని ఆడారు. ఈ రాష్ట్రానికి తిరిగి మీ పాలన ఎంతైనా అవసరమని మీరు మరలా ప్రజాక్షేత్రంలో పర్యటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలసాని గోపాల నాగేశ్వరావు విజయలక్ష్మి వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

### పెడన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
# భారీ అన్న సమారాధన



**పెడన, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాకంబరీ అలంకారం సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీ వాసవి ప్రార్ధన మందిరము నందు శ్రీ వాసవి మాతకు అన్నప్రసాదాల నైవేద్యాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో విశేషంగా సమర్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమంలో పెడన పట్టణ, మండల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ వాసవి మాత అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్యవైశ్యులు జై వాసవి జై జై వాసవి అని స్మరిస్తూ వాసవి నామస్మరణతో ఈ ప్రాంగణం మారుమ్రోగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు చిలకల శ్రీనివాస్ గుప్తా కొల్లిపర పూర్ణ ప్రదీప్ గుప్తా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా కార్యదర్శులు కోడూరి రమేష్, జవాజి నాగు ఉత్సవముల కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు కొమ్మూరి సుధారాణి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు కోశాధికారి పొన్నూరు అపర్ణ కార్యవర్గ సభ్యులు కొల్లూరి పద్మ, మామిడి లావణ్య, కొల్లూరి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు పూర్తి భరోసా ఇచ్చిన
# ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అయినవిల్లి, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి .గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలం లోని గోదావరి వరద బాధిత ప్రాంతములను పి. గన్నవరం శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ పర్యటించారు. పొట్టిలంక ,కొండుకుదురు, కొండుకుదురులంక, తొత్తరమూడి వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక, మడిపల్లిలంక ,చింతల లంక, ముక్తేశ్వరం కాజ్వే వరద ముంపు ఏరియాలను పర్యటించినారు. ఈ సందర్భంగా వరద బాధితులను పలకరించి ప్రభుత్వం వరద బాధితులకు పూర్తి భరోసా ఇస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించినట్టుగా గోదావరి వరద ప్రమాదనకు నష్టపోయిన ప్రతి ఒక్కరికి కూడా నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం ధవలేశ్వరం వద్ద ,భద్రాచలం వద్ద గోదావరి వరద తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉంది కాబట్టి ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఎవరు కూడా భయాందోళన చెందవద్దని, ప్రభుత్వ అధికారులతో మోనిటరింగ్ చేయుచు మీరందరికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, గోదావరి వరద తాకిడికి గురైన కుటుంబములు వారు గోదావరి వరద శిబిరములకు రావాలని వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగినదని, పూర్తిగా జిల్లా అధికారులు అందరూ కూడా వరద బాధితులకు సహాయం చేయడానికి అందుబాటులో ప్రభుత్వం ఉంచిందని , అదేవిధంగా పశు నష్టం, ప్రాణం నష్టం జరగకుండా ప్రభుత్వం రక్షణ చర్యలను తీసుకున్నదని, పశువులకు మేతను కూడా ఏర్పాటు చేయడం జరిగినదని ,రైతులందరూ కూడా పశువైద్యాధికారిని సంప్రదించి పశువులకు మీ గ్రామంలో గల పశు వైద్యశాల నుండి తీసుకుని వెళ్లాలని, ముక్తేశ్వరం కాజ్వే అంచనాలు తయారు చేసిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఎంతోమంది లంక ప్రాంతవాసులు కాజ్వే మునిగిపోవడం వలన రహదారి మార్గం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, త్వరలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి ముక్తేశ్వరం కాజ్వే ,అప్పనపల్లి కాజ్వే వద్ద శాశ్వతమైన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, లంక గ్రామంలో గోదావరి వరద కోతకు గురై చాలా గ్రామంలో నది ప్రవాహం వలన దెబ్బతినే



పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి రివిట్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని, ముఖ్యంగా లంక గ్రామంలో మంచినీరు లేకుండా ఉన్న గ్రామాల్లో త్వరలోజలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాలకి మంచి నీరు సౌకర్యం పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయడం జరుగుతుందని, వీరవల్లి పాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో మంచినీరు వాటర్ ట్యాంక్ నిర్మాణమునకు ఏర్పడిన కోర్టు కేసు విషయంలో అధికారుల ద్వారా పరిష్కారం చేయడం జరిగిందని, త్వరలో గ్రామ పెద్దల యొక్క సమక్షంలో సరైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, వీరవల్లిపాలెం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది గోదావరి వరదల్లో ప్రజలకు తమ సేవలపై అశ్రద్ధ వహించొద్దని, ఆసుపత్రికి వచ్చిన రోగులతో మర్యాదపూర్వకంగా మరియు రోగులయందు గౌరవముగా మెలగాలని, వైద్య సేవలలో ఎవరు నిర్లక్ష్యం వహించిన క్షమించే పరిస్థితి ఉండదని, ప్రజా సేవ చేయడమే ప్రభుత్వ అధికారులు ,రాజకీయ నాయకులు లక్ష్యమని, ప్రభుత్వం ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి వైద్య సేవలు పేద ప్రజలకు అందించమని చెప్పుతుంటే కొంతమంది వైద్యులు, సిబ్బంది రోగులు పట్ల అభద్రతా భావంతో ,నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మంచిది కాదని హెచ్చరించి, విధులలో నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వం క్షమించ దని తెలిపినారు. ముఖ్యంగా సరైన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి సిబ్బంది అందరూ కూడా విధుల్లో ఉండాలని తెలిపినారు .మండలంలో వరద బాధితులకు 4500 వందల రేషన్ కార్డుదారు లకు 25 కేజీలు చొప్పున బియ్యం, తదితర సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని. పూర్తిస్థాయిలో రైతులకు, వరద బాధితులకు పడవలను వరద బాధిత గ్రామాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపినారు. పొట్టిలంక, వీరవల్లిపాలెం గ్రామాలలో స్వయంగా వరద బాధితులకు ఉచిత గోదావరి బియ్యం 25 కేజీల చొప్పున శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేసినారు. వీరవల్లిపాలెం గ్రామంలో కరెంట్ షాక్ కు మరణించిన అడపా జీవన్ కుమార్ మరణించిన కుటుంబమును మరియు అయినవిలంక గోదావరి వద్దకు మరణించిన గోడి శ్రీనివాసరావు కుటుంబంను పరామర్శించినారు. శాసనసభ్యులు వెంట గోదావరి వరదలకు ప్రత్యేక అధికారి గౌరీ శంకర్, మండల ప్రత్యేక అధికారి సత్యనా రాయణ, తాసిల్దార్ డి. ఎల్ .ప్రమద్వార , ఎంపీడీవో టి. సూర్యనారాయణ మూర్తి, పంచాయతీ విస్తరణ అధికారి గరిమెళ్ళ రవి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అర్జున్ రావు, అయినవిల్లి ఎస్సై సురేష్ కుమార్, ఆర్డబ్ల్యూసి ఇంజనీరింగ్ అధికారి కళ్యాణ్ బాబు, ఇరిగేషన్ అధికారులు, మత్స్యశాఖ అధికారులు, అయినవిల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పోలిశెట్టి రాజేష్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగుదేశం కార్యవర్గ కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావు, తెలుగుదేశం జనసేన పార్టీ సమన్వయకర్త మద్ద చంటిబాబు, రాష్ట్ర సర్పంచుల సమైక్య కార్యదర్శి సలాది బుచ్చిరాజు, మండల ఉపాధ్యక్షులు అడపా వెంకట నాగభూషణం, తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీ నాయకులు సలాది పుల్లయ్య నాయుడు, కల్లేపల్లి సుబ్బరాజు, ఇంటగుల వెంకటరామయ్య, సలాది బాబురావు, కుప్పల రాంబాబు, తోలేటి ఉమా, విల్ల నవీన్, పడాలగిరి, కోరపు ఈశ్వర్, మోర్తా సత్తిబాబు, మేడిది ప్రసాద్, కాకర శ్రీనివాసరావు వార జయ సావిత్రి లక్ష్మీనరసింహారామ్, కుమ్మరి మాధవి వెంకటరమణ ,పోతుల వెంకట్రావు, బిక్కిన బాబి, బాల విజయ రామారావు ,వాసంశెట్టి కుమార్, గళ్ళ అశోక్, కొప్పిని నాతి శ్రీరామచంద్రమూర్తి, నాతి గవరయ్య, నాయకులు ,పంచాయతీ కార్యదర్శులు ,రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల సేవలను విస్తృతం చేయాలి



**పాఠశాలల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలి**
**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి**
**జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్పర్సన్ జె. సుభద్ర**

**విశాఖపట్టణం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని, ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని, పాఠశాలల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్పర్సన్ అధ్యక్షత జరిగింది. విశాఖపట్ట ణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్ భాగస్వామ్యమ య్యారు. సర్వసభ్య సమావేశంలో భాగంగా అజెండా అంశాలను జడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు చదివి వినిపించగా సభ్యులు వివిధ శాఖల పనితీరుపై, ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, విద్యా వ్యవస్థ సేవలపై జడ్పీటీసీ సభ్యులు, వివిధ నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు చర్చ సాగించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పలు అంశాలపై స్పందించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అధికారులు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఫ్రై డే డ్రైడే కచ్చితంగా పాటించాలని నిర్దేశించారు. కేజీహెచ్ లో వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో అవసరాలకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, వ్యవసాయ విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లో సేవలను మెరుగుపర్చాలని చెప్పారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించాలని, పాఠశాలల్లో, వసతి గృహాల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని నిర్దేశించారు. సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలు అంశాలపై స్పందించారు.




**పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి**
**టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు:** జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, గుత్తేదార్లు దానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తుంగ్లాం పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని, పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఫసల్ భీమా యోజన సేవలను రైతులకు చేరువ చేయాలి**
**మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఫసల్ భీమా యోజన సేవలను రైతులకు చేరువ చేయాలని, ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా ప్రీమియం వసూలు చేస్తున్నప్పటికీ రైతులకు భీమా అందటం లేదని సభ్యులు ప్రస్తావించి న అంశానికి మద్దతు ఇస్తూ.. దీనిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవా లని అధికారులకు సూచించారు. సచివాలయ సిబ్బంది సేవలను పూర్తిస్థాయి లో వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపించేందుకు సమష్టి కృషి చేయాల్సి ఉందన్నారు. పీపీపీ విధానంలో నడిపిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా, లాభదాయకంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

**విత్తన పరిశోధన కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తేవాలి**
**చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు**
చోడవరం మండలం గంధవరంలో నిర్మించతలపెట్టిన విత్తన పరిశోధన కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్వపరాలు తెలుసుకొని నివేదిక రూపొందించాలని, సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బుచ్చయ్యపేట మండల పరిధిలోని కొండెంపూడిలో నిర్మిం చ తలపెట్టిన కృషి విజ్ఞాన్ కేంద్రం సేవలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. వద్దాది, నాయుడుపాలెం రెసిడెన్షియల్ పాఠశాల లను ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు విన్నవించారు.

**ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**
**ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పేర్కొన్నారు. కోసూరు జడ్పీ హైస్కూల్ స్థలం ఆక్రమణకు గురైందని జడ్పీటీసీ సభ్యుడు ప్రస్తావించగా దానిపై ఎమ్మెల్యే స్పందించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇదిలా ఉండగా ఈయన లేవనెత్తిన అంశాలపై కొంతమంది సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ప్రజా సమస్యలపై చర్చ సాగాలి**
**పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు**



జిల్లా పరిషత్ వేదికగా సాగే సమావేశాల్లో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ సాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సమయాన్ని వృథా చేయకూడదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ఘటనలను, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

**వైద్యాధికారుల స్పందన, తీరు మారాలి**
**అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం**
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాల్సిన నైతిక బాధ్యత వైద్యాధికారులపై ఉందని, ప్రజల ఆరోగ్య సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని అరుకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం పేర్కొన్నారు. ఇటీవల ఒక వైద్యాధికారి నుంచి ఎదురైన చేదు అనుభవాన్ని ఆయన సభలో ప్రస్తావిస్తూ.. వైద్యాధికారుల స్పందన, పనితీరు మారాలని హితవు పలికారు.

**కేజీహెచ్ సేవలను విస్తృతం చేయాలి**
**ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు**
ఉత్తరాంధ్ర జిల్లాలకు అతి ప్రధానమైన కేజీహెచ్ సేవలను విస్తృతం చేయాలని, గతం కంటే మెరుగైన రీతిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు పేర్కొన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేజీహెచ్ లో సంస్కరణలు తీసుకురావాలని, గతం కంటే మార్పు చూపిస్తూ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల ఫోన్లు చేస్తే అధికారులు తక్షణమే రెస్పాండ్ అవ్వాలన్నారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా కేజీహెచ్ ను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని హితవు పలికారు. సుపరిపాలన అందించేందుకు అధికారులంతా సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు.

**మార్చురీలో డబ్బులు వసూళ్లు ఆపాలి**
**వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి**
కేజీహెచ్ మార్చురీ వద్ద బాధితుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, అవసరానికి మించిన వస్తువులు కొనుగోలు చేయిస్తున్నారని పలువురు జడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాన్ని ఉటంకిస్తూ.. పూర్తిస్థాయి విచారణ జరిపించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విజ్ఞప్తి చేశారు. ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో గందరగోళం నెలకొందని.. పూర్తిగా అవగాహన కల్పించి విక్రయాలు జరపాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై విశాఖపట్టణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు స్పందించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని బదులిచ్చారు. స్థాయీ సంఘాల నూతన సభ్యులను ఎంపిక చేస్తూ నిర్ణయంజిల్లా పరిషత్ పరిధిలోని ఏడు స్థాయీ సంఘాలకు నూతన సభ్యులను ఎంపిక చేస్తూ జడ్పీ చైర్పర్సన్ ప్రపోజల్ పెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలను ఆయా కమిటీలకు నూతన సభ్యులుగా ఎంపిక చేస్తూ సభ నిర్ణయం తీసుకుం ది. ఈ మేరకు జడ్పీ సీఈవో పేర్లను చదివి వినిపించారు. అలాగే ఏపీ మినిస్టీరియల్ రూల్స్ ప్రకారం జడ్పీ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ కమ్ క్లర్క్, టైపిస్ట్ కమ్ క్లర్క్ పేర్లను జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్ పేరును సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మార్చినట్లు జడ్పీ సీఈవో వెల్లడించారు.

**నూతన ఎమ్మెల్యేలకు సత్కారం:** ఇటీవల రాష్ట్ర శాసన సభకు ఎన్నికైన నూతన ఎమ్మెల్యేలను గౌరవ సూచకంగా సర్వసభ్య సమావేశంలో భాగంగా జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్లు, జడ్పీటీసీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలను బహుకరించారు.

**రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు మృతికి సంతాపం:** సర్వసభ్య సమావేశంలో భాగంగా ఇటీవల మృతి చెందిన రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మకు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు.

---

**రాజమండ్రి - ఏలూరు.. రాజమండ్రి - కాకినాడ**

## నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్





**రాజమహేంద్రవరం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ ఎప్పుడు ముందుంటుందని సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు రాజమండ్రి - ఏలూరు, రాజమండ్రి - కాకినాడ నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ వ్యవస్థ అంటే ఒక నమ్మకమని, ప్రజలను తమ యొక్క గమ్య స్థానాలకు సురక్షితంగా తీసుకువెళ్లే వ్యవస్థ ఏదైనా ఉందంటే అది ఆర్టీసీ అని తెలియజేశారు. ఇప్పటికే రాజమండ్రి నుంచి అనేక సర్వీస్ లు ఉన్నాయని, అయినప్పటికీ ప్రజలకు ఉత్తమమైన సర్వీసులు అందజేయాలనే ఉద్దేశంతో రాజమండ్రి నుంచి ఏలూరుకు ఒక బస్సు సర్వీసు, రాజమండ్రి నుంచి కాకినాడకు రెండు బస్సుల సర్వీసులను ప్రారంభించుకున్నామన్నారు. ఆర్టీసీ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఎప్పటికప్పుడు తమ సేవలను విస్తరిస్తూ ప్రయాణికుల ప్రయాణికుల మన్ననలు పొందుతూ ముందుకెళుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ఆర్టీసీ కార్యాచరణను కొనసాగిస్తూ ముందుకు వెళుతూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తమ బాధ్యతలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికీ ఉచిత ఇసుక పాలసీని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చే ప్రయత్నంలో రవాణా శాఖతో చర్చలు జరిపామని రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తారని తెలియజేశారు. ఆగస్టు 15వ తేదీన అన్నా క్యాంటీన్ కూడా ప్రారంభించుకొనున్నామన్నారు. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపిటిఓ, కె.షర్మిల అశోక్, డి ఎం, డిపో మేనేజర్,ఎస్.కె. శబ్నం, బస్సు ఓనర్స్, సూపర్వైజర్స్,సెక్యూరిటీ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీఏఏల సూచనలు మేరకు ఎరువులు వాడాలి



**కె.కోటపాడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** వ్యవసాయ శాఖ సహాయకుల సలహాలు, సూచనల మేరకు ఎరువులను తగు మోతాదులో వాడాలని మండలంలోని గొండుపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బండారు కనకమల్లేశ్వరి ప్రతినిధి బండారు లక్ష్మణరావు అన్నారు. శనివారం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద సుమారు 213 మంది రైతులకు 530 బస్తాల యూరియా ఎరువును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వరి సాగు చేస్తున్న రైతులు ప్రతి దశలోనూ వి.ఎ.ఎ.ల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుధీర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీపై సమావేశం



**కె.కోటపాడు, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెలలో పింఛన్ల పంపిణీ సకాలంలో జరగాలని మండల ప్రత్యేక అధికారిణి నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి పరిశీలకులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారి (ఈఓపీఆర్డీ) ప్రసాద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ మంగతాయారు మండల ఇంజనీరింగ్ అధికారి బాలాజీ, మండల విద్యాశాఖ అధికారి-1 కూనిరెడ్డి సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి-2 డి.వి.డి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జిఐసిఈ టాపర్లకు పాఠ్యపుస్తకాలు వితరణ

**పూర్వ విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్ కె.వి రమణ**



**విశాఖపట్నం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** కెమికల్ ఇంజనీరింగ్ డిప్లొమాలోని మొత్తం 4 బ్రాంచ్‌లలోని టాపర్‌లకు ప్రామాణిక పాఠ్య పుస్తకాలు వితరణ చేయడం అభినందనీయమని, ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ 1971 - 1975 వరకు చదివిన మొదటి బ్యాచ్ విద్యార్థులు అందిస్తున్న ప్రోత్సాహం ఆదర్శనీయమన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుకున్న కళాశాల అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చి కునేలా స్థిరపడాలన్నారు. పూర్వ విద్యార్థులు చదువుకున్న కళాశాలలో తన వంతు సేవలందించాలని తలపెట్టిన ఈ కార్యక్రమాలు ప్రస్తుతం చదువుకుంటున్న యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నుండి వి రామచంద్ర రావు, వి నాగభూషణం, పి కనక సాయి, జే శంకర్రావు, డివివి సత్యనారాయణ, ఎమ్. ఎస్ ఎన్ రాజు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి వి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

**గంకల కవిత అప్పారావు**

**విశాఖపట్నం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** వార్డులో నిర్మిస్తున్న రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు అన్నారు. 48వ వార్డులో గల పంచగ్రామాలు అయిన బాపూజీ నగర్,రామకృష్ణ నగర్,నీలకంఠ నగర్, శివలింగ పురం, పల్నాటి కాలనీ ప్రాంతంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా నిర్మాణం చేపట్టాలని గుత్తేదారులను ఆదేశించారు.



## మెడికవర్ హాస్పిటల్స్ గైనిక్ సేవల్లో 30 శాతం రాయితీ



**విశాఖపట్నం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** విశాఖపట్నం వర్కింగ్ కార్పొరేట్ మహిళల కోసం మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేకంగా 'షీ క్లినిక్స్'ని ప్రవేశపెట్టింది. విశాఖపట్నం పోర్టు అథారిటీలోని గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ సీఎంఓ డాక్టర్ ఎస్ ఉషాదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. "మెడికవర్ హాస్పిటల్" విశాఖపట్నంలో 'షీ క్లినిక్' ని ప్రారంభించినందుకు గర్వంగా ఉంది, ఎందుకంటే ఉద్యోగం చేసే మహిళలు ప్రతి శనివారం అన్ని పరిశోధన లపై 30 శాతం తగ్గింపుతో ఉచిత గైనకాలజిస్ట్ సంప్రదింపులను ఉపయోగించుకోవచ్చు. ఇది ఆరోగ్య సంరక్షణ సేవల్లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. అధునాతన వైద్య పరికరాలు నైపుణ్యంతో, ఈ సౌకర్యాలు అన్ని వయసుల వారి ప్రత్యేక అవసరాలను తీర్చడం ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలను విప్లవాత్మకంగా మారుస్తాయని జీవితాలను కాపాడతాయని నమ్మకాన్ని వ్యక్తపరిచారు. ప్రస్తుతం, వ్యక్తిగత వృత్తిపరమైన బాధ్యతల కారణంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్నారు. ఒత్తిడి, పునరుత్పత్తి సమస్యలు స్త్రీ జననేంద్రియ సమస్యలు శ్రామిక మహిళల్లో ప్రబలంగా ఉన్నాయి. తమ వ్యక్తిగత బాధ్యతలతో సమతుల్యం చేసుకోవడానికి తరచుగా పోరాడుతున్నారు. కన్సల్టెంట్స్ ప్రసూతి గైనకాలజిస్ట్ డాక్టర్ పప్పు శాంతి, డాక్టర్ కిరణ్మయి గొట్టాపు, డాక్టర్ తనూజ ప్రియదర్శిని , సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సోధన్ కుమార్, కన్సల్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్మూలనకు సమిష్టి కృషి చాలా అవసరం

**ముఖ్య కార్యదర్శి ఎం తిరుమల కృష్ణ బాబు**



**విశాఖపట్నం, జూలై 28, జర్నలిస్ట్ ఫైల్ :** క్యాన్సర్ రోగులు రోజురోజుకీ పెరిగిపోతున్నారని, క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ముఖ్య కార్యదర్శి ఎం తిరుమల కృష్ణ బాబు పిలుపునిచ్చారు. 27 నుండి 28 వరకు రెండు రోజులు పాటు సెకండ్ అన్యువల్ మీటింగ్ నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఆంధ్ర మెడికల్ కాలేజీలో నిర్వహించారు . స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం తిరుమల కృష్ణ బాబు హాజరైనారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శిల్పా ఏఎంసి కేజీహెచ్ వారు వెల్కమ్ అడ్రస్ తో సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు ఆంధ్ర మెడికల్ కాలేజ్ నందు జరిగింది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు క్యాన్సర్ పై సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ చికిత్స విధానాలలో వస్తున్న ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు ఈనెల 28 న కూడా వైద్య సదస్సు నిర్వహించినట్లు కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప తెలిపారు. హెూమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి జాతీయ క్యాన్సర్ ఏపీ చాప్టర్ ఆంధ్ర వైద్య కళాశాల అంకాలజీ విభాగము సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ఈ గ్రంథాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీష, విశాఖ కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, డి ఎం ఈ నరసింహం, కేజీహెచ్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ శివానంద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి జగదీశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రముఖలైన క్యాన్సర్ వైద్య నిపుణులు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న బీహార్ పీసీసీ అధ్యక్షులు



శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) : శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారిని బీహార్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు అఖిలేష్ ప్రసాద్, బీహార్ శాసనసభ్యులు రోహిత్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. శ్రీస్వామి అమ్మవారిని దర్శించుకుని అఖిలేష్ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అఖిలేష్ ప్రసాద్ హిందుస్థాన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ. వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్ చెప్పిన డీ సీఎం పవన్..



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ థ్యాంక్స్ చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరి పవన్ సీఎంకు ఎందుకు థ్యాంక్స్ చెప్పారు? ఈ కథనంలో తెలుసుకుందాం. రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వాగతించారు.

ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన పవన్.. 'రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయ. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి అభినందనలు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరునే పెట్టుకున్నారు. ఆ దుస్సంప్రదాయానికి మంగళం పాడి.. విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించే ప్రముఖుల పేర్లతో పథకాలు అమలు చేయడం మంచి పరిణామం. పాఠశాల విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ లాంటివి ఇస్తున్నారు. ఈ పథకాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం సముచితం.' అని పేర్కొన్నారు.

'మధ్యాహ్న భోజన పథకానికి సైతం గత ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకున్నారు. ఇందుకు భిన్నంగా – 'అపర అన్నపూర్ణ' డొక్కా సీతమ్మ పేరును ఈ పథకానికి పెట్టడాన్ని ప్రతి ఒక్కరం స్వాగతించాలి. ఏ వేళలో అయినా కడుపు నిండా అన్నంపెట్టి ఆకలి తీర్చిన దానశీలి డొక్కా సీతమ్మ. వారి దయాగుణం, సేవాభావం విద్యార్థులకు తెలియచేయడం ద్వారా ఆ సద్గుణాలు అలవడుతాయి.' అని పవన్ ఎక్స్ వేదికగా ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించారు.

'మన దేశపు మిస్సైల్ మ్యాన్ డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం ద్వారా యువతలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. పేద కుటుంబంలో పుట్టిన కలాం ఎన్నో ఆటుపోట్ల నడుమ విద్యాభ్యాసం సాగించి శాస్త్రవేత్తగా ఎన్నో విజయాలు అందుకొన్నారు. తదనంతరం రాష్ట్రపతిగా ఆదర్శవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. కలాం జీవన ప్రస్థానం నవతరంలో స్ఫూర్తిని కలిగిస్తుంది. మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేయడం ద్వారా వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకొంటారు. ఆ మహనీయుల దివ్యాశ్శీసులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎల్లవేళలా ఉంటాయి.' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

## కక్షపూరితంగా కేసులో ఇరికించారు : వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** టిడిపి కక్షపూరితంగా కేసులో ఇరికించిందని వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ధ్వజమెత్తారు. మోహిత్ రెడ్డి ఆదివారం ఉదయం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ తనపై పెట్టిన తప్పుడు కేసులపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. పులివర్తి నానిపై ఎక్కడా దాడి జరగలేదనీ, ఘటన జరిగిన 52 రోజుల తర్వాత ఏ–37గా తన పేరును చేర్చారని అన్నారు. ఈ ఘటన జరిగిన రోజు తన ఎదురుగానే జయింట్ కలెక్టర్ కూడా ఉన్నారని తెలిపారు. సెల్‌ఫోన్ కూడా లోపలికి తీసుకెళ్లకూడదు అంటే తాను తీసుకెళ్లలేదనీ, తన ఫోన్‌ను పీఏకు ఇచ్చి తాను లోపలికి వెళ్లానని వివరించారు. కావాలనే కేసుల్లో ఇరికిస్తున్నారని మోహిత్ రెడ్డి ఆరోపించారు. సీఆర్‌పీఎస్‌ 41ఏ కింద నోటీసులు ఇచ్చి ఎప్పుడు రమ్మంటే అప్పుడు రావాలని పోలీసులు చెప్పారని అన్నారు. " మా నాన్నను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి కేసులు పెడుతున్నారు.. మా నాన్నను స్ఫూర్తిగా తీసుకుని పోరాడుతాం " అని అన్నారు. తాము బతికి ఉన్నంతకాలం ప్రజల కోసమే పోరాడుతామన్నారు. టిడిపి నేతలు చంద్రగిరి నియోజకవర్గంలో బీభత్సం సఅష్టిస్తున్నారని చెప్పారు. వారు చేసే అన్ని దందాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటామని ఎన్నికేసులు పెట్టినా వెనక్కితగ్గేది లేదని స్పష్టం చేశారు. అనంతరం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ %ొ% మోహిత్ రెడ్డిపై 52 రోజులు తర్వాత తప్పుడు కేసు పెట్టారని చెప్పారు. తాము నిత్యం ప్రజల్లో ఉండే వాళ్లమని అన్నారు. తప్పుడు కేసులతో మనుగడ సాధించలేరని చెప్పారు. " మీకు దమ్ము ఉంటే, ధైర్యం ఉంటే మెజిస్ట్రేట్ ముందు మీరు హాజరుపరచాలి.. జడ్జి ముందు హాజరు పరిచే ధైర్యం లేదు. మీరు పెట్టిన తప్పుడు కేసులు చూసి వాళ్లకు కచ్చితంగా చివాట్లు పెడతారు. " అని భాస్కర్ రెడ్డి మండిపడ్డారు.

## పసికందు అదృశ్యం - 3 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

- **అనంతపురం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు**



**అనంతపురం క్రైం (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అదృశ్యమైన 5 రోజుల పసికందు కేసును అనంతపురం పోలీసులు 3 గంటల్లోనే ఛేదించారు. వివరాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన గర్భిణీ అమృత ఈనెల 16వ తేదీన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాన్పు కోసం చేరింది. ఈనెల 23వ తేదీన ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. అప్పటి నుండీ ఆసుపత్రిలోని గైనిక్ విభాగంలో తల్లి, చిన్నారి ఉంటూ వైద్య సేవలు తీసుకుంటున్నారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4–30 గంటల సమయంలో పసికందు అదృశ్యమైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దృష్టికి వెళ్లడంతో ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్నారు. వెంటనే ఛేదించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్, టూటౌన్ మరియు నాల్గవ పట్టణ సి.ఐ లు క్రాంతికుమార్, ప్రతాప్ రెడ్డి మరియు అవుట్ పోస్టు ఏఎస్సై త్రిలోక్ నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డును దిగ్బంధనం చేసి అనుమానితులపై విచారణ చేపట్టారు. అంతేకాకుండా సిసిఫుటేజీలను పరిశీలించారు. ఈనేపథ్యంలో స్థానిక నారాయణపురానికి చెందిన ఆమని అనే మహిళ సదరు పసికందును అపహరించినట్లు గుర్తించారు. ఆమె నుండీ పసికందును హ్యాండోవర్ చేసుకుని తల్లిదండ్రులైన అమృత, అనిల్ కుమార్ లకు డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు అప్పగించారు. పసికందు అదృశ్యం ఘటన ఛేదింపుతో కథ సుఖాంతమయ్యింది. అటు తల్లిదండ్రులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా ఎస్పీ, అనంతపురం డీఎస్పీ మరియు సి.ఐ లు, అవుట్ పోస్టు పోలీసులకు ఆ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. పసికందును అపహరించిన మహిళపై చట్టపరమైన చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు. పసికందు అదృశ్యం ఘటనను కేవలం 3 గంటల్లో ఛేదించి ఆ తల్లిదండ్రుల వేదనను తీర్చిన అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్, టూటౌన్ మరియు నాల్గవ పట్టణ సి.ఐ లు క్రాంతికుమార్, ప్రతాప్ రెడ్డి మరియు అవుట్ పోస్టు ఏఎస్సై త్రిలోక్ నాథ్ ఆధ్వర్యంలోపోలీసు బృందాలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# శివానందపురం సమస్యల్ని పరిష్కరించండి

- **బుద్ధ రియల్ ఎస్టేట్ మాఫియా పడగనీడలోశివానందపురం.**



**కడప (జర్నలిస్ట్ ఫైల్) కడప టౌన్:–** ముందు వచ్చిన చెవుల కన్నా, వెనక వచ్చిన కొమ్ములే మిన్న అన్నట్టు, 50 ఏళ్లకు పైగా వయసున్న దళితవాడైనా శివానందపురంపై బుద్ధ రియల్ ఎస్టేట్ మాఫియా పెద్దల పెత్తనం జోరుగా సాగుతుందని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం శివానందపురం, ఎస్టేట్ పరిసర ప్రాంతాలలో ఆయన తన బృందంతో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... బుద్ధ టౌన్షిప్ డెవలప్మెంట్ కోసం, శివానందపురంలో అధికార భూ దాహంతో స్మశాన స్థలం సైతం మింగేసి, అందులో ఇల్లులు నిర్మించుకొని, చెరువును స్మశానంగా మార్చి... అదేదో వారి తాతల గారి ఆస్తిని పంచినట్టు శివానందపుర గ్రామ ప్రజలకు ఇచ్చారని, చెరువులో స్మశానం ఉండటం వలన చిన్నపాటి నీరు చేరడంతోనే అది మునిగిపోతుందని, స్మశానానిక ఏమాత్రం అ స్తలం పనికిరాదని ఆయన వివరించారు.

రహదారిపై విచ్చలవిడిగా అనదికారికంగా రోడ్లువిస్తరణ చేశారని, రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ప్రమాదానికి సంకేతాలుగా ఉన్నాయని, డ్రైనేజీ కాలువలు తిరుమల గాట్ రోడ్డును తలపించేలా వంపులు తిప్పారని, కొంతమంది ఘనులు అధికార పార్టీ అండతో శివానందపురం లేఔట్ లో ఉన్న రోడ్డుని మింగేసారని, గతంలో కమ్యూనిటీ హాల్ ఉన్న స్థలంలో ఉపరితల మంచినీటి ట్యాంకు నిర్మించాలని, నిర్మించినప్పటి నుండి నేటి వరకు అందులోకి నీరు చేరక అది నిరుపయోగంగా మారిందని, శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. మూడు, నాలుగు, ఐదు, తొమ్మిది నెంబర్లలోని రోడ్లు, డ్రైనేజీ కాలువలు చాలా అధ్వానంగా ఉన్నాయని, మనుషులు నడవడమే కష్టంగా మారిందని, ఆయన అన్నారు. పై సమస్యలన్నీ సంబంధిత అధికారులు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే పరిష్కరించాలని, లేని పక్షాన స్థానిక ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళన చేయవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్,విజయ్ కుమార్,రమేష్,వినోద్, పేతురు, అంకయ్య, శీను, గంగులయ్య, గంగయ్య, సన,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు ఆదర్శం

- **9వ,వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**
- **టిడిపి నేత కొర్రపాటి సురేష్**



**గుంటూరు,పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్ ):–** భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ,వర్ధంతి సందర్భంగా పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగు దేశం పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్ మాట్లాడుతూ భారతదేశాన్ని రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా నిలబెట్టిన ఘనత కలాందేనని,వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకం ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించాలని, పట్టుదల కృషి ప్రోత్సహించేలా ఉంటుందని ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని అన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు నాయుడు వైజాగ్‌లో కలాం పాయింట్ వీవ్ ఆయన పేరు మీద ప్రతిభా పురస్కారాలు ఇచ్చి దేశానికి ఆయన సేవలను గౌరవించారని జగన్ పాలనలో రద్దు చేసిన ప్రతిభా పురస్కారాలు చంద్రబాబు నాయుడు తిరిగి అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు లింగంగుంట సాల్మన్ రాజు, పొన్నూరు నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బెజ్జం గోపాలకృష్ణ,మండల తెలుగు యువత నాయకులు లింగంగుంట అశోక్,దొడ్డా అజయ్ కుమార్,రుంజల రవిసాగర్, దళిత నాయకులు బొందలపాటి రంగయ్య, సురేష్ తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## కడప దర్గాను దర్శించుకున్న 'లారీ చాప్టర్ 1' సినిమా హీరో , హీరోయిన్

**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రఖ్యాతిగాంచిన కడప అమీన్ పీర్ దర్గాను ఆదివారం 'లారీ చాప్టర్ 1' సినిమా హీరో శ్రీకాంత్ రెడ్డి, హీరోయిన్ చంద్ర శికాలు దర్శించుకున్నారు. హీరో, హీరోయిన్‌కు దర్గా సంప్రదాయం ప్రకారం దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దర్గా విశిష్టతను శ్రీకాంత్ రెడ్డి, చంద్ర శికాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారివురు మాట్లాడుతూ.దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆగస్టు 2న విడుదల కాబోతున్న తమ సినిమా ప్రేక్షకులు మన్ననలు పొందాలని ప్రార్థించినట్లు చెప్పారు.

## టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు నివాళు



**గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం నివాళులు కార్యక్రమం నిర్వహించినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బత్తుల హేమంత్ మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత రత్న శ్రీ ఏ పీ జే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. క్షిపణి శాస్త్ర విజ్ఞానం రంగంలో చిరస్మరణీయ సేవలు అందించిన కలాం దేశ యువతకు ఆదర్శప్రాయులు. ఆ మహనీయుని జీవితాన్ని మన విద్యార్థులు స్ఫూర్తి పొందుదాం. అని అన్నారు. టి ఎన్ టి యు సి అధ్యక్షులు విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం పుస్తకాలు తన స్నేహితులుగా చేసుకొని మన దేశానికి ప్రధాని స్థాయి దాక వెళ్లారన్నారు. యువతరం ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి.. రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు, భారతరత్న అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మండూరి వెంకటరమణ, టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు శిరీష్, ప్రధాన కార్యదర్శి హరీష్, కోశాధికారి గోపి, కార్యనిర్వ కార్యదర్శి రాకేష్ , టిఎన్ఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, అఖిల్, భాస్కర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచమంతా ఒలిపింక్ క్రీడల వైపు దృష్టి



**బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఇప్పుడు ప్రపంచమంతా ఒలిపింక్ క్రీడల వైపు దృష్టి సారించింది. విభిన్న దేశాలు, భిన్న సంస్కృతులు, వ్యక్తులను ఒక చోట చేర్చడంలో ఒలింపిక్స్‌కు ఒక ప్రత్యేకత వుంది. ఒలింపిక్స్ కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదు–ఆ యా దేశాల అభివ్యక్తి, సంకల్పం, స్థితిస్థాపకత, స్నేహం. 'జీవితంలో ముఖ్యమైన విషయం విజయం కాదు పోరాటం. ఒలింపిక్ క్రీడల్లోనూ అంతే గెలవడం కాదు, పాల్గొనడం' అంటారు ఆధునిక ఒలింపిక్ ఉద్యమ స్థాపకులు పియరీ డి కూబెర్టిన్. గమ్యం ఎంత కీలకమో ప్రయాణం కూడా అంతే కీలకం. కృషి, పట్టుదల, క్రీడా స్ఫూర్తి నేర్పిన పాఠాలు తుది ఫలితాలకు మించిన అనుభవాన్ని సుసంపన్నం చేస్తాయి. పురాతన గ్రీస్ నాటి గొప్ప చరిత్ర వున్న ఒలింపిక్ క్రీడలునేటి భౌగోళిక రాజకీయ సరిహద్దులను అధిగమించే వేదికగా పరిణామం చెందాయి. క్రీడాకారులు తమ దేశాల కీర్తి పతాకను రెపరెపలాడించేందుకు పోటీ పడతారు. 'జీవించడంలో ఉన్న గొప్ప మహిమ ఎప్పుడూ పడకపోవడంలో కాదు, పడిపోయిన ప్రతిసారీ లేవడంలోనే ఉంది' అంటారు నెల్సన్ మండేలా. ఇది క్రీడాస్ఫూర్తిని తెలియజేస్తుంది. ఈ స్థితప్రజ్ఞత %ొ%ఆటలో వైఫల్యం, గాయాలు, వ్యక్తిగత పోరాటాలను అధిగమించిన అథ్లెట్ల కథలతో నిండి ఉంటాయి. అథ్లెట్ల పట్టుదల, అంకితభావం, వారి విజయ గాథలు కోట్లాది మందికి స్ఫూర్తినిస్తాయి. అథ్లెట్లు పోడియంను పంచుకున్నప్పుడు బద్దలయ్యే ప్రపంచ రికార్డులు, ప్రదర్శనల ఉద్విగ్నక్షణాలు గుండె లోతుల్లో ప్రతిధ్వనిస్తాయి.

తాజాగా ప్రపంచమంతా ఆసక్తితో ఎదురు చూసిన పారిస్ ఒలింపిక్స్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఒలింపిక్ గేమ్స్‌కు వందేళ్ల తర్వాత పారిస్ వినూత్న రీతిలో స్వాగతం పలికింది. ఒలింపిక్స్ చరిత్రలోనే తొలిసారి సెయిన్ నదిలో ఆరంభ వేడుకలు నిర్వహించి అబ్బురపరిచింది. క్రీడాకారులు అభివాదం చేస్తూ పడవల్లో ముందుకు సాగారు. ఒకవైపు ఒలింపిక్ జ్యోతితో వ్యక్తి ప్రయాణిస్తుంటూ%ొ%మరోవైపు వర్చువల్ సాంకేతికత మాయాజాలంతో ఫ్రాన్స్, పారిస్ చరిత్ర, సంస్కృతులను చాటేలా నదిపై ఆరు కిలోమీటర్ల మేర జరిగిన పరేడ్‌లో 85 పడవలపై 6800 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. 206 దేశాల నుంచి 10,500మంది అథ్లెట్లు, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులతో పాటు 3,20,000 మందికి పైగా ప్రేక్షకులు ఈ వేడుకలు చూసేందుకు హాజరయ్యారు. వాస్తవికతకు వర్చువల్ సాంకేతికతను జోడించి జ్యోతిని చేపట్టిన ముసుగు వ్యక్తి పారిస్ వైభవాన్ని ప్రపంచానికి చాటేలాఅతను ఒక్కో ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడి ప్రాధాన్యతలతో ఆకట్టుకునే ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ప్యారిస్ అంటేనే ప్రేమ గుర్తు అని చెబుతారు. అలాంటి ప్రేమనగరి ప్రత్యేకతను తెలిపేలా ఆకాశంలో విమానాల పొగతో ఏర్పాటు చేసిన భారీ హృదయాకారంప్రేమికులకే కాదు, క్రీడాభిమానులకూ ఒక చిరస్మరణీయ జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఈ పరేడ్‌లో భారత్ బృందానికి నాయకత్వం వహించిన పి.వి సింధూమువ్వన్నెల జెండాతో అచ్చ తెలుగుదనాన్ని చాటి చెప్పింది.

ముఖ్యంగా ఒలింపిక్స్ సామాజిక, రాజకీయ, లింగ, వర్ణ వివక్షలకు వేదికగా మారాయి. సంవత్సరాలుగా అథ్లెట్ల జాతి, లింగ వివక్ష, మానసిక ఆరోగ్యం వంటి సమస్యలపై చర్చ జరుగుతూనే వుంది. 'ఇవాళ ఒలింపిక్స్ ప్రారంభోత్సవం. కానీ, ఒక ఆఫ్గన్ మహిళగా స్వేచ్ఛ కోసం నా పోరాటం ఒలింపిక్స్‌లో స్థానం కోల్పోయేలా చేస్తుందని గ్రహించలేకపోయాను. లింగవివక్షా పూరిత ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళ కల నెరవేరదు' అంటూ ఆఫ్గన్ తైక్వాండో అథ్లెట్ మర్జియే హమీదీ తన అసహాయతను పంచుకున్నారు. మహిళా అథ్లెట్లను లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ గతేడాది భారతీయ రెజ్లర్లు దేశ రాజధానిలో నిరసన దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు అథ్లెట్ల క్రీడా స్ఫూర్తిని, నైతికతను దెబ్బతీస్తాయి. దీనికి తోడు డోపింగ్, క్రీడాకారుల మానసిక ఆరోగ్యం, పర్యావరణ సమస్యలు వంటివి అంబరాన్నంటే సంబరాలను క్రీనీడలా కమ్ముకునే వుంటాయి. అసమానతలు, లింగ వివక్ష లేని సంస్కృతిని పెంపొందించడం ద్వారా క్రీడా స్ఫూర్తితో కూడిన ఒలింపిక్స్‌ను భావితరాలకు అందించాలి. 'కృషి వుంటే మనుషులు ఋషులవుతారు మహాపురుషులౌతారు/ తరతరాలకి తరగని వెలుగవుతారు ఇలవేలుపులౌతారు' అంటాడు సినీ కవి వేటూరి. క్రీడల్లోను, జీవితంలోనూ కృషి, పట్టుదల సంక్లిష్టమైన ప్రపంచంలో మనిషిగా నిలబెడుతుంది. ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తుంది.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467